ఆదివారం

ప్రజాశక్తి

డిసెంబర్ 14, 2003

కంఠేశ్వర ఆలయం

ఎన్నికల యంత్రం

చెరిగిపోని గతం శేషన్

దిగనున్న లింగ్డో

రేపు ?

హ్యాపీ బర్త్‌డే

(14-12-2003నుండి 20-12-2003వరకు)

కె.వదింత

5సం॥, 14.12.1998

శ్రీవిద్య-వెంకటేష్

బ్యాంకు కాలనీ-బెంగుళూరు

డి. లక్ష్మణ్‌గౌడ్

4సం॥, 14.12.1999

సరోజా- సత్తయ్యగౌడ్

నల్లగొండ

పి. సృజన్

3సం॥, 15.12.2000

పద్మ-రాజ

జన్నూరు- ప॥గో॥

పి. వంశీకృష్ణ

1సం॥, 15.12.2002

విజయలక్ష్మి-నరసింహులు

జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

బి. శైలజ

1సం॥, 15.12.2002

స్వరూప-శ్రీనివాస్

కొండపల్లి- కృష్ణా

సుప్రియ(సుజాత)

3సం॥, 16.12.2000

అనిత-ఉపేందర్

డోర్నకల్-వరంగల్

కె. అలేఖ్య

1సం॥, 17.12.2002

అనురాధ-నాగమల్లేశ్వరరావు

చందోలు-గుంటూరు



జి. జాహ్నవి(హని)

2సం॥, 18.12.2001

గాయత్రి-విజయ్‌కుమార్

రామలింగేశ్వరనగర్-విజయవాడ



సంధ్య

లక్ష్మిదేవి- నాగరాజు

కిట్నూరు- హిమపురం

జి. అమంద

5సం॥, 1998

ఎమీమా-జాబేజ్

కర్నూలు

ప్రనయ్‌రాజ్

4సం॥, 1999

కిరణ్మయి-పుణ్యరాజ్

మెట్‌పల్లి-కరీంనగర్

సి. సురేఖ

1సం॥,2002

కవిత-నరసింహారావు

మొగళ్లూరు-ప్రకాశం

పి.సాయి

4సం॥, డిసెంబర్-1999

నామెగుంట-నెల్లూరు

వి. వికాస్‌గౌడ్

నీరజ-వెంకటేష్‌గౌడ్

నర్సపూర్-మెదక్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

విజ్ఞాన దాయకం

మానవాళిని కబళిస్తున్న 'ఎయిడ్స్ భూతం' ఈ వారం కవర్ స్టోరీ విజ్ఞానదాయకంగా ఉంది. ఎయిడ్స్ పట్ల ప్రజల్లో నెలకొన్న అవగాహనా రాహిత్యం, ప్రపంచ వ్యాప్తంగా దాని విస్తృతి వ్యాప్తి చెందే తీరు ఎన్నెన్నో విలువైన అంశాలు ఈ వ్యాసంలో చోటు చేసుకొన్నాయి. ఎయిడ్స్ నిరోధానికి ఎంత కృషి చేస్తున్నప్పటికీ నానాటికీ వ్యాధి ప్రబలటం ఆందోళన కలిగిస్తోంది. సెక్స్‌కు ప్రాధాన్యం ఇచ్చే సినిమాలు, సీరియళ్ళు కూడా ఎయిడ్స్ వ్యాధికి అవకాశం ఇస్తున్నాయి. యువతీ యువకుల్లోను, నిరక్షరాస్యుల్లోను ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఈ వ్యాసం నొక్కి చెప్పింది.

– మంకు శ్రీను, కొవ్వూరు,
ప.గో.జిల్లా.

అలీబాబు అంగామా బాగుంది

నవంబర్ 30వ తేదీ కచేరి శీర్షికలో ప్రచురించిన ఆలీబాబు-అంగామా చాలా బాగుంది. ఎన్నికల ముందు చేస్తున్న జిమ్మి క్కులను, పదవి కోసం ఆయన పడుతున్న పాట్లు ఎంత హాస్యాస్పదమైనవో పాఠకులకు అర్థమయ్యే విధంతో పాటు తనదై, యాసభాషతో హాస్యాన్ని కూడా అందించారు. అలాగే దర్శన్‌గారి హైటెక్ కూలి బాగుంది. ప్రపంచ బ్యాంకు సంస్కరణలను అమలు పరిచే కీలుబొమ్మ ప్రభుత్వం వున్నంత వరకు నిరుద్యోగులు పెరుగుతూనే వుంటారు. ఉద్యోగాలు లేక, వేరే మార్గం లేక ఎంత మంది నిరుద్యోగులు తక్కువ జీతానికి ఎక్కువ పని చేయడానికి సిద్ధపడుతున్నారు. ఇంకా గురజాడ ఆధిక్యానికి కారణాలు, గుండెపోటును నివారించడం ఎలా? బాగున్నాయి.

– పి.పద్మావతి, భ్రమరాంభికానగర్, మెదక్

కనువిప్పు కలిగించింది

నవంబర్ 30వ తేదీ సంచికలో ప్రచురించిన హైటెక్ కూలీ కథ కనువిప్పు కలిగించింది. వేలు, లక్షలు పెట్టుకుని కంప్యూటర్ విద్య నేర్చుకున్న యువకులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అందులో చక్కగా వివరించారు. దానిపై భ్రమలు పెంచుకోవడం మంచిది కాదని సలహా ఇచ్చారు.

– ఎ. శ్రీధర్, శ్రీకాకుళం;
టి. సుబ్బారావు, కొత్తగూడెం

జాతీయ కవి గురజాడ

నవంబర్ 30 ప్రజాశక్తి ఆదివారం అను బంధం కళా సాహితిలో గురజాడ గురించి శ్రీశ్రీ వెలిబచ్చిన అభిప్రాయాలు ఏకీభవించే విధంగా వున్నాయి. సామాజిక స్పృహ, వాడుక భాషా ప్రయోగం, సార్వజనీన దృక్పథం గురించి శ్రీశ్రీ ఈ వ్యాసంలో లోతుగా చర్చించారు. కవిగా, నాటకకర్తగా, కథా రచయితగా సాహిత్యంలో కొత్త కోణాలను స్పృశించిన గురజాడ తెలుగు సాహిత్యంలో జాతీయ కవి అనటంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. కన్యాశుల్కం నాటకం ముత్యాల సరాల ఛందస్సులో ఆయన రాసిన పూర్ణమ్మ కన్యక కవితలే ఇందుకు సాక్ష్యాలు.

– షేక్ ఆలీవలీ, మొగల్తూరు

రెండూ కావాలండి

ఈరోజున టెలివిజన్ల ఛానళ్ళలో వస్తున్న కార్యక్రమాలపై రెండూ కావాలండి పేరుతో రాసిన సెటైర్ ఆసక్తి కరంగా ఉంది. చదువుకునే యువతను, గృహిణులను కార్యక్రమాలతో వేధించే ప్రోగ్రాంలపై ధైర్యంగా రాసినందుకు అభినందనలు.

– పి. అనంతలక్ష్మి,
వనస్థలిపురం, హైదరాబాద్

వరాల మూట!

అది చాలా పెద్ద కుటుంబం!

ఆ కుటుంబానికి ఆయనే పెద్ద దిక్కు!

సన్నిహితులు అనేకమంది ఆయన్ని మహామేధావిగా ప్రేమతో పిలుచుకుంటారు. అసలు పేరుకంటే ఈ బిరుదు బహుపసందుగా వుందని ఆయన మురిసిపోవడం సన్నిహిత వర్గం గుర్తించింది!

అంచేత–

ఇకముందు సమస్తమైన ప్రజానీకం సదరు శ్రీవారిని ఆ బిరుదుతోనే పిలవాలని సన్నిహిత వర్గం ప్రచారం చేసి పుణ్యం కట్టుకుంది!

ఫలితంగా–

శ్రీవారి సొంతపేరు చెరిగిపోయింది!

మహామేధావిగా స్థిరపడిపోయింది!

శ్రీవారి కుటుంబంలో నడుస్తున్న భాగోతం–ఇప్పటిమాదిరే–ఎప్పుడూ చప్పచప్పగానే వుంటుందని శ్రీవారికి బాగా తెలుసు!

కుటుంబ మాజీ పెద్దలంతా ఈ కుటుంబాన్ని బాగు చేయలేక అలిసిపోయి వున్నారనీ తెలుసు!

సాక్షాత్తు–

ఆ పరమేశ్వరుడే దివి నుంచి దిగి వచ్చి – ఆ ఇంటి నట్టింట సింహాసనం అలంకరించినా – ఆ కుటుంబ గాథలో మార్పు ఏ మాత్రం వుండదని కూడా తెలుసు!

అందువల్ల –

వర్తమానం కడు దీనంగా అఘోరించినప్పుడు...

రానున్న కాలం రతనాల కాలమని –

ఇంటి జనాభాని ఎప్పటికప్పుడు బుజ్జగించాలి!

రాజకీయ పరంగా–

ఈ మాదిరి దిక్కుమాలిన సూత్రాలు చెప్పిన గురువెవరో ఆయనకు గుర్తుండదు!

గురువు జ్ఞాపకం లేకపోయినా తప్పులేదు గానీ –

గురుడు చెప్పిన పాఠాలు మరిచిపోతే మాత్రం పుట్టగతులుండవని ఆధునిక రాజకీయ శాస్త్రం చెబుతోంది!

అందువల్ల –

రానున్న అయిదేళ్ళలో ఆకలి అనే మాటకి అర్థముండదంటాడు! వంటిమీద బట్టకి కరువులేదంటాడు!

ఏడేళ్ళు ఓపిక పడితే ఏలిన నాటి శని పొరుగు దేశాలకు పారిపోతుందంటాడు!

అందరూ ఇంటి ఓనర్లే అవుతారంటాడు!

ఇంత చెప్పిన వాడు – ఇంకా తానెంతకాలం ఇంటి పెద్దగా వుంటాడో చెప్పలేదు! అదంతా తాను అనుగ్రహించే వరాల మూట పవర్తో ముడిపడి వుంటుందంటాడు!

దట్సాల్!

ఈ సంచికలో . . .

ఔరా!	. . . 3
కనదగు నెవ్వరు గీచిన...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
టూరిస్ట్ గైడ్	. . . 21
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

కదలిక

కథ ... 8

చదువు కోసం ఆరాటం – ఒంటికాలితో పోరాటం

రియల్‌స్టోరీ . . . 14, 15

కాలుష్యంతో ఉబ్బసం

ఆరోగ్యం . . . 18

రేపటి ప్రేక్షకుల కోసమే మేము నటిస్తున్నాం

కళాసాహితి . . . 22

SPEAK ENGLISH FLUENTLY

తెలుగు తెలిస్తే చాలు...

మీరు ఇంట్లోనే ఉండి సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి!

5 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు మరి మీరూ...

కొత్త సంవత్సర కానుక



స్టూడెంట్ అభిప్రాయం

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ ఫ్లూయెంట్‌గా మాట్లాడలేకపోయేవాడిని. నాకు ఒక మిత్రుని సలహా లభించి కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ తెప్పించి చదివాను. కేవలం ఒక్క నెలరోజుల్లోనే చక్కగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతున్నాను.

– జె.వి.రావు, విజయవాడ.

ఈ కోర్స్‌తో 25 గిఫ్ట్ పుస్తకాలు ఉచితం!

1. హిందీ స్పీకింగ్ కోర్సు 2. తమిళ్ స్పీకింగ్ కోర్సు 3. కన్నడ స్పీకింగ్ కోర్సు 4. మలయాళం స్పీకింగ్ కోర్సు 5. బెంగాలీ స్పీకింగ్ కోర్సు 6. మరాఠీ స్పీకింగ్ కోర్సు 7. పంజాబీ స్పీకింగ్ కోర్సు 8. గుజరాతీ స్పీకింగ్ కోర్సు 9. అరబిక్ స్పీకింగ్ కోర్సు 10. ఉర్దూ స్పీకింగ్ కోర్సు 11. ఒరియా స్పీకింగ్ కోర్సు 12. సాన్‌స్క్రిట్ స్పీకింగ్ కోర్సు. (12 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఇంగ్లీష్ డిక్షనరీ 2. వర్డ్ పవర్ 3. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ 4. వెర్బ్స్ డిక్షనరీ 5. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ. (5 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఈజీ మనీ ఎర్నింగ్ కోర్సు. 2. సీక్రెట్ మ్యాజిక్ కోర్సు. 3. జెంట్స్ స్మార్ట్‌నెస్ కోర్సు. 4. బ్యూటీ ట్రీట్‌మెంట్ కోర్సు. 5. సక్సెస్‌ఫుల్ ఎగ్జామినేషన్ కోర్సు. 6. యోగా కోర్సు. 7. పా 'మిస్టరీ' కోర్సు. 8. కిచెన్ ట్రీట్‌మెంట్ కోర్సు. (8 ఇన్ 1 పాకెట్ సైజులో) *ఈ ఇంగ్లీష్ కోర్స్ తర్వాత మరో నాలుగు నెలల కోర్సు కూడా ఉంది. ఈ కోర్సులు నియమిత నామమాత్రపు ఫీజుతో పంపుతాము. మీరు కావాలనుకుంటే పొందవచ్చు. తప్పకుండా తీసుకోవాలన్న నిబంధన లేదు.

ఈ కూపన్ పంపండి.

K.V.R. B.Com.,B.L., (Director)

KVR INSTITUTE
Award Winner

No.76, Habibullah Road, T.Nagar, Chennai - 17. Ph: 044-56107404.

నాకు కె.వి.ఆర్. ఒక నెల ఇంగ్లీష్‌కోర్స్, కొత్త సంవత్సర కానుక ఉచిత డైరీ మరియు 25 గిఫ్ట్‌పుస్తకాలు వి.పి.పి. లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.200/-లు పైకం చెల్లించి తీసుకుంటాను.

(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్స్‌ను పంపుటకు వీలుపడదు)

Name: ....

Address: ....

....

.... Pin Code: [ ]

2691

DIRECT COACHING CENTRES: ● CHENNAI: 56107404. ● NELLORE: 2342347.

కనదగు నెవ్వరు గీచిన...





హైదరాబాద్ నగరం ఐ.టి.కి, వైద్యానికి, క్రీడలకు లాగా అల్లర్లకు కూడా కేంద్రమా దాడీ?...



ఔరా!

బాల చిత్రకారిణి!

బుడి బుడి అడుగులతో, ముద్దులొలికే మాటలతో కన్నవారిని ఆనందపరిచే వయసులో ఉన్న ఆ పదహారు నెలల పసిపాప అందంగా పెయింటింగులు వేస్తోందట! మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీకి చెందిన అరుషి భట్నాగర్ మనుషులు, జంతువుల బొమ్మలు చక్కగా వేస్తుందట. ఈ పాప కళాదృష్టిని గమనించిన ఆమె తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించడమే గాకుండా ఇటీవల ఢిల్లీలో జరిగిన పిల్లల పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు తీసుకువెళ్ళారట. అయితే దాని నిర్వాహకులు ఆరుషి చిత్రకళను విశ్వసించలేదు, ఆమె చిత్రాలు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడానికి అనుమతించలేదు. నిర్వాహకుల వైఖరితో నిరాశపడిన అరుషి తండ్రి అక్కడికి వచ్చేవారందరికీ తమ గారాలబిడ్డ చిత్రకళ గురించి, ఆమె వేసిన చిత్రాల గురించి చాలా చెప్పారు. అయితే ఎవరినీ నమ్మించలేకపోయారట! తమ కుమార్తె 400కు పైగా చిత్రాలు వేసిందని వారు చెబుతున్నారు. ఇక చేసేదేమీ లేక అరుషి తండ్రి ఆమె బ్రష్ చేతపట్టి బొమ్మలు వేస్తుండగా తీసిన ఫోటోగ్రాఫ్‌లను బయటి గోడపై వరుసగా అంటించి వచ్చేపోయేవారికి చూపించాడట. ఎవరూ నమ్మకపోతే అంతకన్నా ఏం చేస్తాడు మరి?

ఇంటిపనివారికి గుర్తింపుకార్డులు

తమను కార్మికులుగా గుర్తించాలని ముంబయి నగరంలోని పనిమనుషులు చేస్తున్న పోరాటాన్ని ఎట్టకేలకు మహారాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇళ్ళలో పనిచేసేవారికి గుర్తింపుకార్డులు, కనీసవేతనాలు, అలవెన్సులు, రిటైర్‌మెంట్ సదుపాయాలు కల్పించడానికి నిర్ణయించింది. ఈ పథకాన్ని తొలుత ముంబయి, థానే నగరాల్లో అమలు జరిపి తదనుగుణంగా రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాలకు విస్తరింపచేయాలని యోచిస్తోందట. ఇళ్ళలో పనిచేసేవారి కోసం ప్రత్యేకంగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సారథ్యంలో ఒక బోర్డ్‌ను కూడా మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిందిట!

చికెన్ తినడం తగ్గుతోందట!



మన దేశంలో రాను రాను చికెన్ తినడం తగ్గుతోందని ఆ పరిశ్రమ వర్గాలు తెగ బాధపడుతున్నాయి. గత ఏడాది దేశంలో సగటున తల ఒక్కంటికి 1200 గ్రాముల చికెన్ తిన్నారట. 1990 లెక్కలతో పోలిస్తే ఈ వినియోగం 500 గ్రాములు తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి. 2002లో నాలుగు దక్షిణాది రాష్ట్రాల్లో 52 కోట్ల కిలోల చికెన్ తినగా, ఉత్తరాది రాష్ట్రాలవారు 32.5 కోట్ల కిలోలు తిన్నారట. తూర్పు రాష్ట్రాల ప్రజలు 17.5 కోట్ల కిలోలు తిన్నారట. మొత్తం మీద కోళ్ళను తినడంలో మనమే ముందున్నామన్నమాట!

చేపలమ్ముకుంటున్న యూనివర్శిటీ

మాజీ సోషలిస్టు దేశమైన రుమేనియాలో యూనివర్శిటీలకు అక్కడి ప్రభుత్వం నిధులను పూర్తిగా నిలిపివేసి వాటిని ఆర్థిక సంక్షోభానికి గురిచేసింది. దీంతో ఆ యూనివర్శిటీలు నిధులను సమకూర్చుకోవడానికి రకరకాల మార్గాలు అన్వేషిస్తున్నాయి. ఆల్‌కుజా యూనివర్శిటీ కొత్త రకాల చేప విత్తనాలను సృష్టించడంలో పేరెన్నిక గన్నది. ఈ రంగంలో తమకున్న పరిజ్ఞానంతో చేపలను పెంచి యూనివర్శిటీ కేంటిన్ ద్వారా ప్రజలకు అమ్మి నిధులు జమచేసుకుంటున్నారట! మనుగడ కోసం అధ్యాపకులు, చదువుకోసం విద్యార్థులు సంయుక్తంగా ఈ పార్ట్‌టైమ్ పనిలో నిమగ్నమయ్యారట. ప్రభుత్వం నిధులు నిలిపివేస్తే మన యూనివర్శిటీలు ఏం చేస్తాయో?



* తెలకపల్లి రవి

గుజరాత్‌లో మహాదారుణమైన జాతి హత్యాకాండ అనంతరం ఆ భయానక వాతావరణంలోనే అర్జెంటుగా ఎన్నికలు జరిపేస్తే తనకు రాజకీయంగా లాభదాయకమని బిజెపి నాయకత్వం, ముఖ్యమంత్రి నరేంద్రమోడీ ఆలోచించారు. ఆ విధంగానే అసెంబ్లీని రద్దు చేశారు. కానీ ఎన్నికల కమిషన్ వెనువెంటనే ఎన్నికలు జరపడానికి పరిస్థితులు అనుకూలంగా లేవని భావించింది. మరో ఆరు మాసాల తర్వాత గాని ఎన్నికలు జరగలేదు. ఇది గత డిసెంబర్‌లో మాట.

అలిపిరిలో తనపై హత్యాప్రయత్నం అనంతరం ఎంతోకొంత సానుభూతి ఏర్పడింది కనుక దాన్ని సొమ్ము చేసుకోవడానికి ఎన్నికలు ముందుకు జరిపితే మంచిదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తలపోశారు. కాని ఎన్నికల కమిషన్ ఆయన కోరుకుంటున్నట్లుగా 2004 ఫిబ్రవరిలో ఎన్నికలు జరపడానికి వీలు కాదు పొమ్మంది. ఇప్పటికీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనేది సందిగ్ధంగానే వుంది.

ఎన్నికల యంత్రం

రాష్ట్రానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, దేశానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అత్యున్నతమైనవి. అయితే ఆ ప్రభుత్వాల అధికారం ఎన్నికలు ముగిశాకనే ప్రారంభమవుతుంది. అప్పటి వరకూ అధికారమంతా ఎన్నికల కమిషన్ చేతుల్లోనే వుంటుంది. ఒక విధంగా చెప్పాలంటే అధికారం దాని ఎన్నికల ప్రకటనతో ప్రారంభమై ఫలితాల వెల్లడితో ముగుస్తుంది. ఏదో ఒక విధమైన ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించే దేశాలన్నిటిలో సర్వసాధారణమైన విషయమిది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సకల అధికారాలు ఎన్నికల సంఘాలకే వుంటాయి. ప్రభుత్వాల ఏర్పాటు మధ్య వ్యవధిలో న్యాయంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేట్లు చూడటం పూర్తిగా ఈ సంఘం బాధ్యతే.

రాజ్యాంగంలో శాసనవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ అని మూడు అంగాలున్న సంగతి మనకు తెలుసు. కాని ఇవి గాక స్వయం ప్రతిపత్తి గల సంస్థలు కొన్ని వున్నాయి. వాటిలో ఎన్నికల సంఘం, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(సిఎజి), లోకాయుక్త, (ఏర్పడితే లోక్‌పాల్, సరిగ్గా వుంటే ప్రసార భారతి) వంటివి వస్తాయి. వీటన్నిటిలోనూ ఎన్నికల సంఘం అత్యంత కీలకమైనది. ఎందుకంటే ఎన్నికలు న్యాయంగా, స్వేచ్ఛగా, సక్రమంగా సకాలంలో జరగడం ప్రజాస్వామ్యానికి ప్రాణం. మిగిలిన కొన్ని వ్యవస్థలలాగా ఎన్నికల సంఘాన్ని కూడా శాసనబద్ధంగా గాని, పాలనా పరంగా గాని ఏర్పాటు చేయవచ్చు. కాని ఈ ఉద్దేశంతోనే రాజ్యాంగ నిర్మాతలు ఎన్నికల సంఘాన్ని స్వయం ప్రతిపత్తితో ఏర్పరిస్తే గాని నిజంగా న్యాయం జరగదని భావించారు. అందుకే రాజ్యాంగం 15 వ భాగంలో ఇందుకోసం ఒక ప్రత్యేక ఏర్పాటు చేశారు. భారత దేశ జనాభాలో వైవిధ్యాన్ని బట్టి ఎన్నికల నిర్వహణను రాష్ట్రాలకు వదిలేస్తే కుదరదని ఒకే కేంద్ర సంఘాన్ని ఏర్పరుస్తున్నట్టు అంబేద్కర్ చెప్పారు.

రాజ్యాంగం 324 వ అధికరణం ప్రకారం పార్లమెంటు, శాసనసభలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఓటర్ల జాబితాల తయారీ పర్యవేక్షణ, నిర్వహణ నియంత్రణ, ఎన్నికల సన్నాహాలు, నిర్వహణ, బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. ఎన్నికల సంఘంలో చీఫ్ ఎలక్షన్ కమీషనర్ (ప్రధాన ఎన్నికల అధికారి), అలాగే రాష్ట్రపతి నిర్ణయించే సంఖ్యలో ఎన్నికల కమీషనర్లు వుంటారు. అదనపు కమీషనర్లు వుంటే చీఫ్ కమిషనర్ కమిషన్‌కు అధ్యక్షుడుగా వుంటాడు. ఈ పనిలో సహకరించేందుకు ప్రాంతీయ ఎన్నికల కమీషనర్లను నియమించవచ్చు. ఎన్నికల కమీషనర్‌ను పార్లమెంటులో అభిశంసన ద్వారా తప్ప తొలగించకూడదు. ఇక ఎన్నికల

ఎన్నికల భారతంలో భేతాళ పర్వం!

స్వాతంత్ర్యానంతర ఎన్నికల చరిత్రలో టి.ఎన్.శేషన్‌కు ఒక ప్రత్యేకమైన పేజీ కేటాయించవలసే వుంటుంది. చేసిన పనుల మంచి చెడ్డలు అలా వుంచితే ఆయన మన ఎన్నికల వ్యవస్థను ఒక కుదుపు కుదిపి వదిలిపెట్టారు. ఏవో కొన్ని మినహాయింపులు తప్ప క్రియా శీలత ప్రదర్శించడానికి వెనుకాడే ఎన్నికల సంఘానికి ఆయన పదును తెచ్చారు. అయితే దానితోపాటే అతిగా వ్యవహరించి, విపరీత పోకడలతో ఎన్నికల వ్యవస్థను ప్రతిష్టంభనలోకి నెట్టడానికి కారకులయ్యారు. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలకు అతీతం కాదని మరచిపోయి సంచలనశీలతకు ప్రాధాన్యత నిచ్చారు. అభ్యర్థుల వ్యయం, ప్రచార సరళి తదితర అంశాలపై కొరడా ఝుళిపిస్తూ దడ పుట్టించారు. తక్షణం గుర్తింపు కార్డులు ఇవ్వకపోతే ఎన్నికలు జరిపేది లేదని ఒక దశలో భీష్మించి, భయపెట్టారు. నియమావళిని ఉల్లంఘించిన పార్టీల గుర్తింపు రద్దు చేస్తానంటూ తనే సర్వాధికారినైనట్టు ప్రవర్తించారు. అయితే అదే సమయంలో మతతత్వ ప్రచారాన్ని, పద్ధతులను మాత్రం పట్టించుకోలేదు. తన హయాంలోనే అద్వానీ బిజెపి ఎన్నికల చిహ్నాన్ని రథయాత్రలో వాడుకున్నా కిమ్మనలేదు. బాబరీ విధ్వంసం తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికలను బిజెపికి అనుకూలమైన విధంగా

ప్రస్తుత ఎన్నికల కమిషనర్లు

జె. ఎం. లింగ్డో
ప్రధాన ఎన్నికల కమిషనర్

బి. బి. టాండన్

టి. ఎస్. కృష్ణమూర్తి

నిర్వహణకు అవసరమైన సిబ్బందిని రాష్ట్రపతి లేదా సంబంధిత రాష్ట్ర గవర్నర్ సమకూర్చవలసి వుంటుంది. (అంటే ప్రభుత్వ సిబ్బందిని ఎన్నికల డ్యూటీ కింద పంపడం)

ఇందులో రెండు అంశాలు ముఖ్యమైనవి. ఒకటి - ఎలాటి వివక్షతలు, అన్యాయాలు లేకుండా ఓటర్ల జాబితాలు తయారు చేయడం. రెండవది- ఎన్నికలలో దుర్మార్గాలు, దౌర్జన్యాలు లేకుండా సవ్యంగా జరిగేట్టు చూడడం. 327, 328 అధికరణాల ప్రకారం ఎన్నికల విషయమై పార్లమెంటు చట్టాలు చేస్తే అమలు జరపవలసి వుంటుంది. కాని ఇవి ఎన్నికల ప్రక్రియలో జోక్యానికి దారి తీసేవిగా వుండకూడదని 328 అధికరణం స్పష్టం చేస్తోంది.

రాజ్యాంగ నిబంధనలు ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా ఎన్నికల ప్రక్రియ ఎప్పుడూ ఏ ఒడుదుడుకులూ లేకుండా సజావుగా సాగిపోలేదనేది తెలిసిన విషయమే. ఇందిరా గాంధీ హయాంలో అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలు కాంగ్రెస్‌పై అసంతృప్తి పెంచుతున్న కొద్దీ సక్రమమైన ఎన్నికల నిర్వహణ సమస్యగా మారింది. ఎన్నికల్లో అక్రమాలు సర్వసాధారణమైనాయి. 1972లో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కేంద్రం సైన్యాన్ని దించి తమకు అనుకూలంగా ఓట్లు పడ్డాయని ప్రకటించుకుని ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసింది. ఆ సమయంలో సిపిఎం ఎన్ని విమర్శలు చేసినా ఇతర పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. కాని 1972లోనే ఎన్నికల సంస్కరణలపై ఒక కమిటీని వేయడం మాత్రం జరిగింది. ఇందిరా కాంగ్రెస్‌లో చేరి వైదొలగి, గర్వాల్ నియోజక వర్గ ఉప ఎన్నికలో లోక్‌సభకు పోటీ చేసిన హెచ్.ఎన్.బహుగుణను ఓడించేందుకై అక్కడ దారుణమైన రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. దాంతో అప్పటి ఎన్నికల కమీషనర్ షక్దర్ పోలింగ్‌ను రద్దు చేశారు. ఎన్నికల సంఘం తన స్వయం ప్రతిపత్తిని ప్రదర్శించడం అదే ప్రథమం. ఆ కారణం వల్లనే షక్దర్‌కు పదవీ కాలం పొడగించాలని అన్ని పార్టీలు ఏకగ్రీవంగా కోరినా అంగీకరించలేదు. 1983లో అన్ని పార్టీలు సమావేశమై ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఆమోదించాయి. కాని దానికి చట్టబద్ధత కల్పించలేదు. 1989లో రాజీవ్ గాంధీ హయాంలో త్రిపుర ఎన్నికలను అది వరకు పశ్చిమబెంగాల్‌లో చేసినట్లే రిగ్గింగ్ చేశారు. అప్పటి ఎన్నికల కమీషనర్ పేరిశాస్త్రి తనకు అనుకూలుడు కాదనే ఉద్దేశంతో రాజీవ్ గాంధీ లోక్‌సభ ఎన్నికలు ప్రకటించిన తర్వాత హడావుడిగా ఇద్దరు అదనపు కమీషనర్లను నియమించారు. సహజంగానే రాజకీయ నేపథ్యాన్ని బట్టి ఈ చర్యను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. తర్వాత వచ్చిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం మిగిలిన ఇద్దరి నియామకాలను రద్దు చేసింది. ఫ్రంట్ హయాంలో ఎన్నికల సంస్కరణలపై సూచనల కోసం నియమించబడిన దినేష్ గోస్వామి కమిటీ బహుళ సభ్య ఎన్నికల సంఘం వుండాలని ప్రతిపాదించింది. కాని ఆ లోగానే ఫ్రంట్ ప్రభుత్వం కూల్చివేయబడింది. తర్వాత కొంత కాలం వి.ఎస్.రమాదేవి తాత్కాలిక ఎన్నికల కమీషనర్‌గా వున్నారు. ఆమెను ఖాయం చేయడానికి బదులు చంద్రశేఖర్ కీలుబొమ్మ ప్రభుత్వం టి.ఎన్.శేషన్‌ను తెచ్చి ఎన్నికల కమీషనర్‌గా నియమించింది. అప్పటి నుంచి మరో అధ్యాయం.

1993 డిసెంబరు లో పార్లమెంటు మరోసారి ఎన్నికల సంఘాన్ని బహుళ సభ్య సంఘంగా మారుస్తూ చట్టం తెచ్చింది. దానిపై శేషన్ కోర్టుకు వెళ్లాడు. చివరకు సుప్రీం కోర్టు ఆ చట్టం చెల్లుతుందని తీర్పు నివ్వడంతో ఆ అధ్యాయం ముగిసింది. అప్పటి నుంచి ఎన్నికల సంఘం బహుళ సభ్య సంఘంగానే కొనసాగుతోంది.

ఎన్నికల సంఘం విశేషాలు

ఎన్నికల కమిషన్ కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలో వుంది. అదే నిర్వాచన్ సదన్. దాని సచివాలయంలో మూడువందల మంది సిబ్బంది వున్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక ప్రధాన ఎన్నికల అధికారి తనకు అవసరమైన సిబ్బందితో పని చేస్తుంటాడు. ఇక జిల్లా, ఆ దిగువ స్థాయిలో ప్రభుత్వాధికారులే ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. నిజంగా ఎన్నికలు జరిగే తరుణంలో రెండు వారాల పాటు పెద్ద సంఖ్యలో అదనపు సిబ్బందిని తీసుకుంటారు. వారు పోలింగ్, కౌంటింగ్ విధులు నిర్వహిస్తారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ ఓటింగు హక్కు కలిగివుంటారు. వీరి జాబితాను సక్రమంగా నిర్వహించడం, తాజా పరచడం ఒక పెద్ద తతంగం. జాబితాలను కంప్యూటరీకరించడం కూడా జరిగింది. అలాగే పోలింగ్ ప్రక్రియను సరళతరం చేసేందుకై ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టారు. ఫొటో గుర్తింపు కార్డులు 33 కోట్లకు పైగా పంపిణీ చేశారు.

ఎన్నికల ప్రక్రియ ఎలా మొదలవుతుంది?

లోక్‌సభకు, శాసనసభకు ప్రతి అయిదేళ్లకోసారి ఎన్నికలు జరగాలి. ఆయా ప్రభుత్వాలు గనక నిర్ణయిస్తే గడువుకు ముందే జరగవచ్చు. ఎవరూ ప్రభుత్వాన్ని ఏర్పరచగల స్థితి లేదని రాష్ట్రపతి భావిస్తే లోక్‌సభను రద్దు చేసి ఎన్నికలకు ఉత్తర్వులివ్వొచ్చు. 1977 తర్వాత కేంద్రంలో ప్రభుత్వాలు చకచకా మారిపోయాయి. దీనివల్ల ఎన్నికలు కూడా వెంట వెంట జరపవలసిన పరిస్థితి ఏర్పడింది. లోక్‌సభ గడువును మించి వున్న ఘటన ఒక్కటే వుంది. అది 1975 ఎమర్జన్సీ. ఇందిరా గాంధీ ప్రభుత్వం 1976లో జరగవలసిన ఎన్నికలను రాజ్యాంగ సవరణ ద్వారా కృత్రిమంగా వాయిదా వేయించింది. కాని అనుకోని విధంగా 1977లోనే ఎన్నికలకు వెళ్లి ఓటమి చవి చూసింది.

రాష్ట్రాలలోనూ ఇలాటి సమస్యలు రాకపోలేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో నాడున్న జలగం వెంగళరావు ప్రభుత్వం కూడా గడువు ముగిసినా ఈ సవరణ ప్రకారం ఎక్కువ కాలం కొనసాగి 1978లో ఎన్నికలు జరిపించింది. జమ్మూ కాశ్మీర్, అస్సాం, పంజాబ్ రాష్ట్రాలలో కూడా ఎన్నికలు రాజ్యాంగం నిర్ణయించిన గడువులోగా జరపలేని పరిస్థితులు చాలా సార్లు ఎదురైనాయి. అలాంటప్పుడు లోక్‌సభ ప్రత్యేక చట్టాల ద్వారా వాటిలో రాష్ట్రపతి పాలన కొనసాగడానికి ఏర్పాట్లు చేసింది. సాధారణంగా సభ రద్దయిన ఆరుమాసాలలోగా ఎన్నికలు జరగాల్సి వుంటుంది. అసాధారణ పరిస్థితులు ఏర్పడితే కొంత వ్యవధి తీసుకోవడం జరుగుతుంది. రాజీవ్‌గాంధీ హత్యానంతర పరిస్థితులలో పార్లమెంటు ఎన్నికల రెండవ దశ వాయిదా పడింది. ఏమైనా నిర్దేశిత గడువులోగా జరగవలసిన ఎన్నికలు జరపలేకపోతే అందుకు పార్లమెంటు అనుమతి



సాగదీసి జరిపించారు. అందుకే ఎన్నికల సంఘంలో అదనపు కమీషనర్ల నియామకాన్ని బిజెపి మాత్రం వ్యతిరేకించింది. పదవీ విరమణ తర్వాత శేషన్ శివసేన తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేయడం గమనార్హం. నేను భేతాళుణ్ణి అని ప్రకటించుకున్న శేషన్ ఎన్నికల ప్రకటన, వాయిదా, రద్దు, లెక్కింపు నిలిపివేత, ఫలితాల నిలిపివేత అన్నీ తన ఇష్టానుసారం జరగాలన్నారు. అదనపు కమీషనర్లు రాకుండా అడ్డుకోవడమే కాక కోర్టుకు వెళ్లారు. శేషన్ చర్యలను గట్టిగా ఖండించిన మరో కమీషనర్ కృష్ణమూర్తి కూడా అంతకంటే వివాదాస్పదంగా వ్యవహరించడం ఆసక్తికరమైన విషయం. ఆయనను కాకుండా గిల్‌ను పదవి వరించడానికి అదే కారణం. తర్వాత వచ్చిన లింగ్డో కూడా చాకచక్యంగా పదవీ కాలం పూర్తి చేసుకుంటున్నాడు. ఇటీవల ఎన్నికల సందర్భంలో ప్రభుత్వ విమానాన్ని ఉపయోగించినందుకు గాను కాంగ్రెస్ గుర్తింపు రద్దు చేస్తానని ఆయన చేసిన ప్రకటన మాత్రం విమర్శలకు గురైంది. ఎన్నికల కమిషన్ ఎంత శక్తివంతమైనదైనా ప్రజాస్వామ్య పరిధిలో పని చేయాలే గాని తనే రాజకీయపార్టీలను శాసించగలననుకోవడం, బెదిరింపు ధోరణిలో మాట్లాడ్డం సముచితం కాదు. నియమనిబంధనలు నిష్పక్షపాతంగా అమలు జరపడం ముఖ్యం.

తీసుకోవలసి వుంటుంది.

శాసనసభలు రద్దయిన ఆరు మాసాలలోగా ఎన్నికలు జరగాలనేది నిబంధన. రెండు సమావేశాల మధ్య విరామం ఆరు నెలలకు మించి వుండకూడదని రాజ్యాంగం చెబుతుంది. వాతావరణ పరిస్థితులు, పంటలు, పరీక్షలు, పండగలు, ఇతర ఎన్నికలు వగైరా అంశాలను పరిగణనలోకి తీసుకుని తేదీలను నిర్ణయిస్తుంది. ఈ లోగా బ్యాలెట్ బాక్సులను తరలించడం, పోలింగ్ సిబ్బంది నియామకం, ఉత్తర్వులు, శాంతి భద్రతల పరిరక్షణకు ఏర్పాట్లు జరిగేలా చూడటం వంటి పనులు ఎన్నికల కమిషన్ నిర్వహించవలసి వుంటుంది. నామినేషన్లు తీసుకోవడానికి రిజిస్ట్రార్‌ను నియమించాలి. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు 1200 మంది ఓటర్లకు మించకుండా ఏర్పాటు చేయాలి. అలవాటైన పనిగా కనిపించే ఈ విషయాలన్నీ వాస్తవంలో చాలా వ్యయప్రయాసలతో పకడ్బందీగా చేయవలసిన పనులు.

లోక్‌సభకైతే పదివేలు, శాసనసభకైతే అయిదు వేలు డిపాజిట్ చెల్లించిన అర్హులైన అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించి తక్కువ వ్యవధిలోనే బ్యాలెట్ పత్రాలు తయారు చేసి పంపాల్సి వుంటుంది. ఎన్నికల్లో నేరస్థ రాజకీయాలు అరికట్టాలని కొంత ప్రయత్నం జరుగుతున్నా ఇంకా పురోగతి సాధించలేదు.

ప్రచార నిబంధనలు

ఎన్నికల ప్రచారంలో నియమ నిబంధనలు పాటించబడేట్టు చూడవలసిన బాధ్యత కూడా ఎన్నికల సంఘంపై వుంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అధికార పార్టీలు ఎలాటి వాగ్దానాలు చేయకూడదు. ప్రచార ప్రమాణాలకు విరుద్ధంగా వ్యక్తిగత దాడులకు పాల్పడకూడదు. కుల మత తత్వాలను రెచ్చగొట్టకూడదు. పరిమితికి మించి ఖర్చు పెట్టకూడదు. అయితే ఈ నియమ నిబంధనలు చాలా వరకు కాగితాలకే పరిమితమవుతుంటాయి. శేషన్ హయాంలో కొన్ని కట్టుదిట్టాలు చేయడంతో అభ్యర్థులు, పార్టీలు కూడా జాగ్రత్త పడటం ప్రారంభమైంది. 1997లో తెచ్చిన సవరణ ప్రకారం లోక్‌సభ అభ్యర్థి రు. 15 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థి రు. 6 లక్షలు మించి ఖర్చు చేయకూడదు. అభ్యర్థి వ్యక్తిగత వ్యయం, పార్టీ తనకోసం పెట్టే వ్యయం వేర్వేరు అన్న లొసుగు వుండటంతో పాలకపార్టీలు యధేచ్ఛగా డబ్బు వెదజల్లుతున్నాయి. రాజకీయ పార్టీలు తమ ఖాతాలు సక్రమంగా నిర్వహిస్తేనే ఈ మినహాయింపు వర్తిస్తుందని సుప్రీం కోర్టు చెప్పినా ఈ వ్యవస్థలో మిగిలిన అన్ని విషయాలలాగానే దీనికి గ్రహణం పట్టింది. కాకపోతే



కమిషన్ ఏర్పడినప్పటినుండి ప్రధాన ఎన్నికల కమిషనర్లు

1. సుకుమార్ సేన్	మార్చి 1950 నుండి 1958 డిసెంబర్ వరకు
2. కెవికె సుందరం	డిసెంబర్ 1958 నుండి 1967 సెప్టెంబర్ వరకు
3. ఎస్‌పి సేన్‌వర్మ	అక్టోబర్ 1967 నుండి 1972 సెప్టెంబర్ వరకు
4. డా. నాగేంద్రసింగ్	అక్టోబర్ 1972 నుండి 1973 ఫిబ్రవరి వరకు
5. టి. స్వామినాథన్	ఫిబ్రవరి 1973 నుండి 1977 జూన్ వరకు
6. ఎస్ఎల్ షక్దర్	జూన్ 1977 నుండి 1982 జూన్ వరకు
7. ఆర్‌కె త్రివేది	జూన్ 1982 నుండి 1985 డిసెంబర్ వరకు
8. ఆర్‌వివిఎస్ పేరిశాస్త్రి	జనవరి 1986 నుండి 1990 నవంబర్ వరకు
9. విఎస్ రమాదేవి	నవంబర్ 1990 నుండి 1990 డిసెంబర్ వరకు
10. టిఎన్ శేషన్	1990 డిసెంబర్ నుండి 1996 డిసెంబర్ వరకు
11. ఎంఎస్ గిల్	1996 డిసెంబర్ నుండి 2001 జూన్ వరకు
12. జె ఎం లింగ్డో	జూన్ 2001 నుండి 2004 ఫిబ్రవరి వరకు
13. ?	ఫిబ్రవరి 2004 నుండి ?

అంతకు ముందు వలె మరీ అడ్డగోలుగా అట్టహాసంగా ఖర్చు చేయడానికి అభ్యర్థులు కొంత జంకుతూ దొడ్డిదోవలు వెతుక్కుంటున్నారు. ప్రచారంలో ఎవరైనా పద్ధతులు తప్పితే చర్యతీసుకునే అధికారం కమిషన్‌కు వుంది. అలాగే పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల మైకు ప్రచారం నిలిపి వేయాల్సి వుంటుంది. ఈ నిబంధనలన్నీ అమలు జరిగేట్టు చూడవలసిన పని ఎన్నికల సంఘానిది. ఈ పని సివిల్ అధికారుల ద్వారానే జరగాలి. సామాన్యంగా ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికల ప్రక్రియలో సైన్యానికి చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పారామిలటరీ బలగాలనే నియోగిస్తారు. పశ్చిమబెంగాల్, త్రిపుర వంటి చోట్ల జరిగిన పరిణామాలు ఇందుకు మినహాయింపుల వంటివి. వాటి ప్రభావం కూడా నష్టదాయకంగానే పరిణమించింది.

లెక్కింపు, ఫలితాలు

ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఆఖరి ఘట్టం ఓట్ల లెక్కింపు. ప్రజల తీర్పు మార్పుకు దారితీసే నిర్ణయాత్మక అంశమది. ఈ పని కూడా ఎన్నికల సంఘం పూర్తి చేయాలి. ఇందుకోసం ముందే సిబ్బందిని నియమించాలి. పోలింగ్ పూర్తయిన బ్యాలెట్ పెట్టెలను సురక్షితంగా వుంచాలి. లెక్కింపు దగ్గర ప్రశాంతత కాపాడటానికి కట్టుదిట్టాలుండాలి. ఈ తతంగమంతాపూర్తయి ఫలితాల ప్రకటన రావడంతో ఎన్నికల సంఘ అధికారులు వూపిరి పీల్చుకుంటారు. అయితే సాంకేతికంగా వారి పని మిగిలే వుంటుంది. గెలిచిన అభ్యర్థుల జాబితాలను వారు రాష్ట్రపతికి, గవర్నర్‌కు అందజేస్తారు. ఆ తర్వాత కొత్తసభ ఏర్పాటు ప్రకటన వస్తుంది. దాంతో ఎన్నికల ఘట్టం ముగిసి, ప్రభుత్వ స్థాపనా ప్రక్రియ మొదలవుతుంది. ఆ పని రాజకీయ పార్టీలకు వదిలిపెట్టి ఎన్నిలక సంఘం తన ఇతర పనులు చూడటంలో మునిగిపోతుంది.



అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ఓట్ల లెక్కింపులో చోటు చేసుకున్న అవకతవకలు తీవ్ర ప్రతిష్టంభనకు దారితీసిన సంగతి గుర్తు చేసుకుంటే ఎన్నికల నిర్వహణ ఎంత సంక్లిష్టమైన పనో అర్థమవుతుంది. అనేక వర్ధమాన దేశాలలో ఎన్నికలు సక్రమంగా జరగలేదనే ఆరోపణలు సంక్షోభాలకు దారితీస్తుంటాయి. ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు మార్కోస్ ఎన్నికలు ముగిసిన చాలా రోజుల తర్వాత కూడా లెక్కింపును తారుమారు చేయడానికి విఫలయత్నం చేశారు. ఇటీవలనే జార్జియాలో షెవర్డ్‌నాడ్జె ఎన్నికలను తొత్తడం చేశాడన్న ఆరోపణపై దిగిపోయాడు. పాశ్యాత్య దేశాలు తమకు నచ్చని చోట్ల ఎన్నికలు సక్రమంగా జరగలేదని రభస చేయడం తెలిసినవిషయమే. అనేక సమస్యలు, లోపాలు వున్నా భారత దేశంలో మాత్రం ఎన్నికల వ్యవస్థ మొత్తంపైన సజావుగానే సాగిపోతుండడం సంతోషకరమైన విషయం. కాని ఇప్పటికి కూడా ఎన్నికల వ్యవస్థపై అనేక అభ్యంతరాలు లేకపోలేదు. ముఖ్యంగా ఏదైనా శాసనం వచ్చే వరకు ఇందుకు సంబంధించిన సర్వాధికారాలు రాష్ట్రపతి చేతుల్లో వుంటాయి. అంటే ఒక విధంగా కేంద్రం చేతుల్లో వుంటాయి. శేషన్ కారణంగా ఈ పరిస్థితి మారినా ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించే విపరీత ధోరణి కూడా వుంది. మెతగ్గా కనిపించే ఎం.ఎస్.గిల్ కూడా సిపిఎంతో సహా పలు పార్టీలకు కనీస ఓటింగు లేనందువల్ల జాతీయ పార్టీల గుర్తింపు రద్దు చేస్తానని తెలిగ్గా మాట్లాడి నాలుక కరుచుకున్నారు. నామినేషన్ల తిరస్కరణ విషయంలోనూ, పార్లమెంటును ఖాతరు చేయకుండా తామే పరిధికి మించిన ఉత్తర్వులు చేయడంలోనూ కూడా కమిషన్ తొందరపడిన ఉదంతాలున్నాయి. రాజ్యాంగం ఏర్పరచిన వివిధ వ్యవస్థల మధ్య సమతుల్యత లేకపోతే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుందనే మాట ఎన్నికల సంఘానికి కూడా వర్తిస్తుంది. ●



'ఏం దయ్యోయ్, ఇంకా బెల్లం కొట్టిన రాయి మాదిరి కూర్చున్నావో?'

'ఏవి జేయమంటావే మరి?'

'ఏవి జేయమంటావేందీ?, కనపట్టంలా? తోటోళ్ళందరూ శనగిత్తనాలకోసం పోతండ్లా?'.

'నిజమేనే, చేతిలో చిల్లిగవ్వ లేకపోయనే, ఎట్టా పొమ్మంటావు? బ్యాంకోళ్ళేమో పాత లోను తీరిస్తేనేగానీ కొత్తగా ఇచ్చేదిలేదంటిరి. సొసైటీ వాళ్ళేమో ఏవీ చెప్పకపోతంట్రి. ఎట్టా చేయాలో అరదం కాకుండా ఉంది.

'ఎట్టా, ఎట్టా అనుకుంటే పనెట్టా అవుద్దయ్యా?. తాళిబొట్టు తీసకపోయి ఆ పెద్దిశెట్టి దగ్గర కుదవబెట్టు. అందరితోపాటు ఒంగోలెల్లి ఇత్తనాలు తీసకరా. నువ్వొక్కడవే పోతే ఇత్తనాల కొట్టోళ్ళు మోసం చేత్తారు.'

'అదెట్టనే, తాళిబొట్టు చిన్నదానికియ్యాలనుకున్నాము గదా? మళ్ళీ అల్లుడు ఏమనుకుంటాడో, ఏమోనే?'.

'ఏమనుకునేదేముందయ్యా, ఏదో ఒకటి చెబుదాములేగానీ, లేచి తొందరగా పెద్దిశెట్టి దెగ్గరికెళ్ళిరా, ఆలస్యమయితే మళ్ళీ చేతిలో దబ్బు లేదంటాడు.' తొందర చేసింది రామయ్య భార్య వెంకాయమ్మ.

అంతకన్నా మరో అవకాశం కూడా లేకపోవటంతో భార్య తాళిబొట్టు తీసుకుని పెద్దిశెట్టి కొట్టుకు బయలుదేరాడు రామయ్య.

పోయినేదాది కరువు. అంతకు ముందేదాది వేసిన పైర్లు వర్షం లేక చేతికి దక్కలేదు. ఆ మాట కొస్తే ఐదారేళ్ళుగా వ్యవసాయంలో నష్టాలే తప్ప పెట్టుబడులు కూడా రావటం లేదు. ఈ ఏడాది కూడా రబీలో వర్షం పడలేదు.

చివరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ప్రస్తుతం మూడురోజులుగా వర్షాలు పడుతున్నాయి.

ఆకాశం కేసి చూశాడు రామయ్య. టీవీ వోళ్ళు చెప్పినట్లు వర్షం వెలిసినట్లే అన్పించింది. పొలాలు ఆరిపోయాయంటే రేపో, మాపో చేలల్లోకి ట్రాక్టర్లు దిగుతాయి.

కొమ్మమూరు కాలువకు ఈ ఏడాది కూడా నీళ్ళొదిలేది లేదని అధికారులు ప్రకటించారు. మెట్ట పైర్లే వేసుకోమని ప్రభుత్వం ఉచిత సలహా ఇచ్చింది. బ్రిటీష్ ప్రభుత్వం అటు విజయవాడ దగ్గర కృష్ణా నది నుంచి ఇటు చెన్నయ్ దాకా సరుకుల రవాణాకని తవ్వించిన బకింగ్‌హాంనే ఇక్కడ కొమ్మమూరు కాలువని పిలుస్తారు. ఈ కాలువకు సంతరావూరు ఎత్తిపోతల పథకం ద్వారా తిమ్మసముద్రం దగ్గర ప్రారంభించి ఉప్పుగుండూరు దాకా ఎమిలేరు ఛానలు నుంచి ఇచ్చే నీళ్ళతో పాతికేళ్ళుగా రైతులు వరి పండిస్తున్నారు. అయితే మూడేళ్ళుగా కృష్ణలో నీళ్ళు లేవంటూ ప్రభుత్వం మొండి చేయి చూపిస్తుండటంతో ఈ ప్రాంతమంతా మెట్టపంటలు వేయక తప్పటం లేదు. దీనికితోడు వర్షాలు లేకపోవటంతో మెట్ట పైర్లు కూడా పండిన పాపాన పోవటం లేదు. ఏటా కరువే. రైతులు అప్పులతో సతమతం అవుతున్నారు.

ఈ ఏడాదన్నా కాసిని డబ్బులు చేతికొచ్చి అప్పులు తీరితే చాలన్నది రామయ్య , వెంకాయమ్మల ఆశ.

అప్పోసొప్పో చేసి తలా కాసిని డబ్బులతో ఈదుమూడి రైతులు పాతికముప్పై మంది ఒంగోలు చేరారు.

ఎప్పటి నుంచో ఆ గ్రామంతో వ్యాపార సంబంధాలు ఉన్న సుక్కలవారి కొట్టుకు చేరుకున్నారు. అక్కడ ఒకటే రద్దీ. ఇసకేస్తే రాలనంతమంది రైతులు విత్తనాలు కొంటున్నారు.

సుక్కల కుటుంబం 1980 ప్రాంతంలో ఉప్పుగుండూరులో చిన్న పురుగుమందుల కొట్టు ప్రారంభించింది. అంతకు ముందు వాళ్ళది ఈదుమూడిలో చిల్లర కొట్టు. ఆ సమయంలో పత్తి పంట వేసిన రైతల్లా వేల రూపాయలు వెనకేసుకుంటున్నారని ప్రచారం జరిగేది. రైతుల మాటేమోగానీ వాళ్ళకు అప్పులు పెట్టిన సుక్కల కుటుంబం మాత్రం రెండేళ్ళలోనే చుక్కలెత్తున సంపాదించుకుందని అనుకునేవాళ్ళు. అట్లా వాళ్ళ కుటుంబం ఆ ఊరి నుంచి ఒంగోలు చేరింది. ఆదాయమూ ఇంతా, అంతా కాదని అంటుంటారు. నకిలీ మందులు, కల్తీ ఎరువులు, విత్తనాల్లోనూ అక్రమాలకు పాల్పడతారని అంటుంటారు తప్ప రైతులు అక్కడకే పోకతప్పని పరిస్థితి. విత్తనాల దగ్గర నుంచి పురుగుమందులూ, ఎరువులూ అప్పుగా ఎంత కావాలన్నా ఇస్తారు. అయితే పంట వాళ్ళకే అమ్మాలి. ధర విషయమూ రైతులు మాట్లాడకూడదు. ఆ మాటకొస్తే సుక్కల కుటుంబ సభ్యులు నోరు విప్పితే రైతులు మాట్లాడే ధైర్యం చేయరు. అంత మాటకారులు ఏడుగురు అన్నదమ్ములు.

వాళ్ళ నాన్న సంగమేశ్వరరావు హయాంలో రాచపూడి నుంచి ఈదుమూడి చేరింది ఆ కుటుంబం. తినటానికి కూడా జరుగుబాటులేని సంగమేశ్వరరావు చిన్నవాడుగా ఉండగా గుగ్గిళ్ళ బుట్ట నెత్తిమీద పెట్టుకుని రాచపూడి నుంచి రోజూ ఈదుమూడి వచ్చి అమ్ముకుని తిరిగి పోతుండేవాడు. అలా అలవాటు పడిన అతను ఊళ్ళోనే చిన్న గది తీసుకుని చిల్లర కొట్టు పెట్టాడు. ఆ తర్వాత వెనక్కి చూసింది లేదు.

* * *

అప్పుడే దుకాణానికి వచ్చిన సంగమేశ్వరరావు పెద్ద కుమారుడు అబ్బారావు ఈదుమూడి రైతులపై ఆప్యాయత కురిపిస్తూ పేరు పేరునా పలుకరించాడు. ఊళ్ళోవాళ్ళను కొందరిని గుర్తు చేసి మరీ వారి సంగతులు అడిగాడు. అంధరికీ గుమస్తాలతో మంచి నీళ్ళిప్పించాడు. అంతా అయిన తర్వాత ఎవరెవరికి ఎన్ని విత్తనాలు కావాలో అడిగి జాబితా రాశాడు.

బలికో కంపెనీ విత్తనాలు బాగున్నాయంటూ వాటినే తీసుకోమని చెప్పాడు.

సంప్రదాయ్ కంపెనీ విత్తనాలు కొందామనుకున్నామని కొందరు గొణిగారు.

దీంతో అబ్బారావు బలికో విత్తనాల గొప్పతనాన్ని రెచ్చిపోయి వివరించాడు.

సంప్రదాయ్ కంపెనీ విత్తనాలయితే ఎకరానికి ఏడెనిమిది క్వింటాళ్ళకన్నా దిగుబడి రావటం లేదన్నాడు. పైగా ఆ రకం పంటకు రేటు రాదని బెదిరించాడు. అసలు కొనేదిక్కు లేకుండా పోతుందని హెచ్చరించాడు. అదే బలికో కంపెనీ విత్తనాలు వేస్తే ఎకరానికి 15 క్వింటాళ్ళ దిగుబడి గ్యారెంటీ అన్నాడు. క్వింటాలుకు కనీసం 2500 ధర పలకకపోతే సగం మీసం తీసేసుకుని తిరుగుతానని కోతలు కోశాడు.

దీంతో రైతులు బలికో విత్తనాలు కొనేందుకు మొగ్గారు.

రామయ్య తన మూడెకరాలకూ విత్తనాలు కొన్నాడు. తొలి రెండు దఫాలకూ చల్లాల్సిన పురుగుమందులు కూడా తీసుకున్నాడు. అందరితోపాటు

ఇంటికి చేరాడు.

శనగపైరుకు అవసరమయిన మంచు బాగా పడుతుండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. విత్తిన తర్వాత వర్షాలు పడకపోవటం కూడా రైతులకు కలిసొచ్చింది.

అప్పటికి శెనగ విత్తి 75 రోజులు గడుస్తోంది. కౌలు రైతులు ఎకరానికి రూ. 8500 నుంచి రూ. 9000 దాకా వెచ్చించగా, సొంతంగా సాగుచేసిన వారికి దాదాపుగా ఐదు వేల రూపాయలు ఖర్చయింది.

పూత కాయగా మారే దశ అది. పొలం వెళ్ళటం, గింజ గట్టి పడుతున్న తీరును పరిశీలించటం రామయ్యకు రోజూ అదే పని.

ఒక రోజు రామయ్యకు అనుమానం వచ్చింది. ఏ మొక్క చూసినా అన్నీ తాలు తిత్తులే. గింజ పట్టలేదు. ఇట్లా ఎప్పుడూ జరగలేదు.

అయినా చూద్దామని పక్క చేలోకి దిగి శనగ తిత్తులను ఒత్తి చూశాడు. అనుమానం లేదు. అక్కడా అంతే. తిత్తుల్లో విత్తనాలు లేవు. ఒత్తగానే గాలి తుస్సున పోతోంది.

రామయ్యకు చెమటల్లు పట్టాయి. గొంతు తడారిపోయింది. వణుకు ప్రారంభమయింది. నిలబడ లేక కూర్చుండిపోయాడు. తర్వాత ఎప్పటికో నెమ్మదిగా ఓపిక తెచ్చుకున్నాడు. లేచి రెండు శెనగ మట్టలు పెరుక్కుని ఇంటి దారి పట్టాడు.

ఎదురొచ్చిన వాళ్లందరికీ వాటి ని చూపించాడు. వాళ్లలో ఒకరిద్దరు మాత్రమే "ఆ...ఇంకా టయిముండ్లా, అప్పుడే అనుమానపడాల్సిన పనీ లేదు." అంటూ చప్పరించారు.

అయితే ఎక్కువమంది మాత్రం "నిజమే, ఏదో జరిగింది. విత్తనాల్లోనే తేడా" అంటూ తేల్చారు. పొలం వెళ్తున్న వాళ్ళు కూడా తిరిగి ఊళ్ళోకి వెనుదిరిగారు.

చెరువు కట్ట దగ్గర అందరూ పోగయ్యారు. దాదాపు ఏడెనిమిది ఏళ్ళుగా శెనగ వేస్తున్న రైతులు కూడా విత్తనాల లోపమనే అన్నారు.

ఈ వ్యవహారం ఊళ్ళో కలకలం పుట్టించింది. ఎకరమా? రెండెకరాలా? ఊరు ఊరంతా అదే రకం వేస్తిరి. దాదాపు పది వేల ఎకరాలు. రూ. 70 కోట్ల దాకా పెట్టుబడి. పెద్ద రైతుల మాటెలాగున్నా, ఇప్పటికే పీకల లోతున చిక్కుకు పోయిన చిన్న, సన్నకారు, కౌలు రైతుల పని గోవిందా అన్న వ్యాఖ్యానాలు అక్కడ విన్పించాయి.

వ్యవసాయ అధికారులను గ్రామానికి రప్పించి తప్పు ఎక్కడ జరిగిందో తెల్సుకోవటం మంచిదని పాల కేంద్రం ప్రెసిడెంట్ అమరేశ్వరరావు అన్నాడు. దీనికిగాను మరుసటి ఉదయాన్నే మండల కేంద్రం నాగులుప్పలపాడు వెళ్ళేందుకు నలుగుర్ని ఎంపికచేశారు. అధికారులకు చెప్పి అక్కడే విలేకరులకు కూడా సమాచారం చెప్పాలని ఆ నలుగురికీ గుర్తు చేసి రైతులు లేచి వెళ్ళి పోయారు.

వారం రోజులు గడిచింది.

మండల వ్యవసాయ అధికారి ఆ రోజు వచ్చాడు. పొలాల్లోకి వెళ్ళి శెనగ మట్టలను పీకి సంచిలో పెట్టుకున్నాడు. 'ఏవి జరిగిందంటారూ?' అంటూ రైతులు ఎన్ని సార్లు అడిగినా 'చూద్దాం' అనే మాట తప్ప ఆయన మరో విషయం చెప్పలేదు. ఊళ్ళోకి తిరిగొచ్చి బండి స్టార్ట్ చేసేటప్పుడు మాత్రం నోరు విప్పాడు. "వీటిని సైంటిస్టులకు చూపిస్తాను. వాళ్ళేమి చెప్పిందీ మీకు తెలియజేస్తాను.' అంటూ వెళ్ళిపోయాడు. రైతులు నిరుత్తరులయ్యారు. "పేపరోళ్ళని పిలిచి చెబితే తప్ప న్యాయం జరగదురా" అని ఓ కుర్రాడు ఆవేశంగా అంటే పలువురు నిజమే, నిజమేనని వత్తాసు పలికారు.

మళ్ళీ కబురు పోవటంతో మరుసటి రోజే ఒక పత్రికా విలేకరి కెమెరాతో సహా గ్రామానికి వచ్చి సమాచారం సేకరించుకున్నాడు. ఫొటోలు తీసుకుని పోయాడు. ఆ తర్వాత నాలుగురోజులపాటు ఆ వార్త కోసం గ్రామస్తులు కళ్ళింత చేసుకుని ఆ పత్రికలో వెదికారు. అయితే సుక్కల అబ్బారావును ఆ బడా పత్రిక విలేకరి అంకారావు కలిశాడని రైతులకు ఏమి తెలుసు పాపం.

దాదాపు పది రోజులు గడిచింది. శనగ తిత్తుల పరిస్థితి ఏమీ మారలేదు. ఏ రైతు చేలోనూ గింజ పట్టిన దాఖలాలు లేవు. కొందరు రైతులు పొలం వెళ్ళటమే మానుకున్నారు.

ఈ విషయాన్ని అబ్బారావు దగ్గర కొందరు రైతులు అనటంతో ఆయన కన్నుమన్నాడు. నలుగురయిదుగురు పెద్దరైతులతో ఫోనులో మాట్లాడాడు. విత్తనాల తప్పే లేదన్నాడు. ఆ కంపెనీ తప్పేచేయదని వివరించాడు. ఎన్నో జాగ్రత్తలు తీసుకుని గానీ విత్తనాలు బయటకు అమ్మకానికి పెట్టరని చెప్పాడు. ఇదంతా గ్రామ ముఠా తగాదాల వల్లనే ఒకరికొకరు ఏదో చేసుకుని ఉంటారని బుకాయించాడు. దీంతో అబ్బారావు నుంచి ఏమి ఆశించీ ఉపయోగం లేదని తేలిపోయింది. పైగా అతనిని ప్రశ్నిస్తే ముందు ముందు అప్పు పుట్టదన్న భయంతో పెద్ద రైతులు గమ్మయిపోయారు.

వ్యవసాయ అధికారి మళ్ళీ కనపడిన పాపాన పోలేదు.

'పేపరు ఇలేకర్లు కూడా డబ్బులేసుకుంటన్నారా' అంటూ ఒక యువరైతు ఆరోపించటంతో ఆరోజు చర్చ ఇంకో రూపం తీసుకుంది. ఏమయినా సరే అందరూ ఒంగోలు పోయి కలెక్టరును కలిసి చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఊళ్ళోని ట్రాక్టర్లన్నింటినీ పెట్టాలని అనుకున్నారు.

మరునటి రోజే ఊరు ఊరంతా కోలాహలంగా 22 ట్రాక్టర్లలో కదిలి ఒంగోలు పోయింది.

దాదాపు వెయ్యి మంది కలెక్టరు కార్యాలయం ప్రకాశం భవనం ముందు చేరి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.

ఎప్పుడో సాయంత్రానికిగానీ కలెక్టరు వారిని పిలవలేదు.

వాళ్ళు అందించిన వినతి పత్రాన్ని తీసుకుని విచారణ జరిపిస్తానని ఆయన హామీ ఇచ్చాడు. కలెక్టరు మాటలు నమ్మిన రైతులు వెనుదిరిగారు.

దినపత్రికల జిల్లా మొదటి పేజీల్లో ఈదుమూడి రైతుల ధర్నా కార్యక్రమం ఫొటోలతో సహా మరుసటి రోజు బ్యానర్ వార్త అయింది. దీంతో ఏదో ఒకటి వెంటనే జరుగుతుందని రైతులు సంబరపడ్డారు.

మరో పక్షం రోజులు గడిచినా అధికారులు స్పందించ లేదు. పైరు ఎండు ముఖం పట్టింది. రైతుల్లో పూర్తి నిరాశ ఏర్పడింది.

ఈదుమూడి రైతుల ధర్నా తర్వాత విత్తనాలు పట్టని శెనగ పైరు వార్తలు పత్రికల్లో రోజూ ఏదో ఒక మండలం నుంచి వస్తూనే ఉన్నాయి.

అసలు తప్పంతా కంపెనీదని, విత్తనాలు అమ్మిన వ్యాపారి దానికి బాధ్యత వహించాలని రైతు సంఘం పత్రికల ద్వారా కోరింది.

కంపెనీ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. సంఘ కార్యకర్తలు ఊరూరా

కరపత్రాలు పంచారు.

ఆ రోజు జిల్లాలోని పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లలో వేలాది మంది రైతులు ఒంగోలు చేరారు.

ఎప్పుడూ నోరు విప్పని రామయ్య అక్కడ ఒకటే నినాదాలు ఇస్తున్నాడు. చెప్పింది వినడమే తప్ప ఎన్నడూ ఎదురు పలకని ఆయన బలికో కంపెనీని మూసి వేయించాలని వాదిస్తున్నాడు. నష్టపరిహారం ఇచ్చేదాకా అక్కడ నుంచి కదలబోమని చెబుతున్నాడు. అరిచి, అరిచి ఆకలయితే వెళ్ళి నీళ్ళు తాగి మళ్ళీ నినాదాలు అందుకుంటున్నాడు. రామయ్యను చూసి కుర్రాళ్ళు రెచ్చిపోతున్నారు. పలు కార్మిక సంఘాలు చందాలు వసూలు చేసి రైతులకు రోజూ భోజనాలు ఏర్పాటు చేస్తున్నాయి.

'ఏడో రోజూ కొనసాగిన శెనగ రైతుల నిరసన'

ఇది రైతుల ఆందోళన కార్యక్రమం ప్రారంభమయిన తర్వాత ఎనిమిదో రోజున దినపత్రికల శీర్షిక.

నిరాశ, నిస్పృహల మధ్య బతుకులీడుస్తున్న రైతుల్లో ఇప్పుడు రామయ్య ఒకడు కానేకాదు. అన్యాయం, అక్రమాలపై ఉరిమిపడుతున్న పిడుగు. విత్తన వ్యాపారి మోసం చేశాడని అతడు విలపించటం లేదు. ఇక అప్పులు తీర్చలేమని బాధపడుతూ ఏ పురుగు మందో తాగి చద్దామనుకున్న గత కాలపు రామయ్య నేడు నిజంగా చనిపోయాడు. పిడికిలి బిగించి తాడో పేడో తేలేదాకా ఉద్యమించటమే మార్గం అని అతనికి గట్టి నమ్మకం కలిగింది. పోరాటాల్లో తన ప్రాణం పోయినా అది తనలా ఈ వ్యవస్థకు నిలువునా బలవుతున్న ఎందరో రైతులకు మార్గదర్శకం అయితే తన జన్మ ధన్యమయినట్లేనని నిండుగా భావిస్తున్న రామయ్య తన భార్యతో సహా రోజూ అక్కడే తింటూ, అక్కడే విశ్రమిస్తూ పోరాటంలో భాగమయ్యాడు. ●

✻ యం.మదన్ మోహన్ రావు

సాటిలేని ఉయాంగ్

బర్మాలో ఒక వ్యక్తి తన కొడుకు గొప్ప సంగీతకారుడు కావాలని ఎంతగా కోరుకున్నాడో తెలియచెప్పే కథ ఒకటి ప్రచారంలో వుంది. ఇవాల్టి మన కథ అదే.

అప్పుడు ఉ యాంగ్‌కు పది సంవత్సరాలు. అతని తండ్రి ఒక తంత్రీ వాయిద్యాన్ని కొన్నాడు. దాన్ని తన కుమారుడికి నేర్పటానికి ఒక గురువును నియమించాడు. ఉ యాంగ్‌కు సంగీతమంటే కొంచెమన్నా శ్రద్ధలేదు. కానీ అతడు దాని తీగలను ఊపుతూ వుంటే ఆ తండ్రి తన కొడుకు సంగీతం అభ్యసించటానికి శ్రమ పడుతున్నాడని మురిసిపోయేవాడు.

అప్పుడప్పుడు ఆ గురువుగారు "అయ్యా! నీ కొడుక్కి ఆ వాయిద్యం వాయించడం నేర్పడం నావల్ల కాదు. ఆ పిల్లవానికి సంగీత జ్ఞానం పిసరంతయినా లేదు" అని మొత్తుకునేవాడు. కానీ అతడు మాత్రం తన కొడుకు ఎప్పటికైనా సంగీత విద్వాంసుడు అవుతాడని, అతని విద్వత్తు ఈ ప్రపంచాన్నే ఉర్రూతలూపుతుందని అనుకునేవాడు.

అట్లా సంవత్సరాలు గడిచాయి. గురువులు వస్తున్నారు. వెళ్తున్నారు. ఉ యాంగ్‌కు 20 సంవత్సరాల వయసు వచ్చింది. కానీ కొత్తగా ఆ పరికరాన్ని వాయించడం నేర్చుకునే వారికెంత వచ్చో అతనికీ అంతేవచ్చు. అతని తండ్రి మాత్రం ఏదోనాటికి తన కొడుకు అతని సంగీత విద్వత్తుతో గొప్ప సంగీతకారునిగా తమ కుటుంబానికి పేరు ప్రఖ్యాతలు తెస్తాడని నమ్ముతూనే కన్నుమూశాడు.

తండ్రి మాట జవదాటని ఉ యాంగ్ తన అభ్యాసాన్ని మాత్రం మానలేదు. తాను అలా కొనసాగించడమే తన తండ్రికి ఇష్టం కాబట్టి అలాగే సాధన చేసేవాడు. తనకు పెళ్లయినా, పిల్లలు పుట్టినా, వాళ్లు పెరిగి పెద్దయినా సంగీత సాధన మాత్రం మానలేదు.

ఆ తంత్రీ వాయిద్యం చేత్తో పట్టుకునే ఉ యాంగ్ మరణించాడు. అతని పిల్లలకు సంగీతం పట్ల ఏ మాత్రం ఆసక్తిలేదు. వాళ్లు దాన్ని ఎక్కడో అటక మీద పడేశారు. అది అక్కడే కొన్ని దశాబ్దాల వరకు దుమ్ము కొట్టుకుని పడివుంది. ఆ తర్వాత దాన్ని ఎవరో వెలికితీశారు. ఆ వాయిద్యం ఉ యాంగ్‌దని తెలిసింది. ఆయన ఒక గొప్ప సంగీతకారుడు కాబోలు అని ఆ తరం వారు భావించారు. ఆ మాట ఆ నోటా ఈ నోటా దేశమంతా వ్యాపించింది. ఉ యాంగ్‌కు, అతని వంశం వాళ్లకు ఎనలేని పేరు ప్రతిష్ఠలు వచ్చాయి. అట్లా ఉ యాంగ్ తండ్రి కోరిక తీరింది! అతని కల నిజమయ్యింది!!

(బర్మా జానపద గాథ)



క్విజ్ 86కి జవాబులు

1. హానిమన్ 2. చంద్రగుప్త మౌర్యుడు 3. గురజాడ అప్పారావు 4. డాల్ఫిన్ 5. జడ్ 6.అధిక పాల ఉత్పత్తి 7. థాయ్‌లాండ్ 8. 'ఎ' విటమిన్ 9. లాల్ బహదూర్ శాస్త్రి 10. చే గువేరా

క్విజ్ 85కి సరైన సమాధానాలు రాసిన వారు :

పి.శ్రీసత్య, టెక్కలి, శ్రీకాకుళం. **కొమరవల్లి శ్రీకాంత్ ప్రసాద్,** 10వ తరగతి, కాటూరు, కృష్ణా. **ఎం.మాధవి,** 10వ తరగతి, మల్లిఖార్జున కాలనీ, రాజాం. **డి.శ్రీనివాసరావు,** 9వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **పి.కన్నయ్య,** 7వ తరగతి, గవరపాలెం, అనకాపల్లి. **కన్నవారి హేమసుందర్,** 10వ తరగతి, **కె.హనుమంతు,** 6వ తరగతి, లక్ష్మినగర్, మెదక్.

కలం స్నేహం

పేరు: ఎ.నాగార్జున,
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : షటిల్ ఆడడం, డ్రాయింగ్ వేయడం, కథలు చదవడం.
పూర్తి చిరునామా :ఎ.నాగార్జున, సన్నాఫ్ వెంకటేశ్వర్లు, 10వ తరగతి, జడ్‌పిహెచ్ స్కూల్, పుల్లల చెరువు, ప్రకాశం-523328.

పేరు: గ్యానం సంధ్య,
వయసు : 7 సం॥
చదువు : 2వ తరగతి
హాబీలు : కథలు చదవడం, ఆడుకోవడం, పాటలు పాడడం.
పూర్తి చిరునామా : గ్యానం సంధ్య, వెంకటాపురం, ఖమ్మం.

కలం స్నేహం చేయాలని వుందా!

మరి ఆలస్యం ఎందుకు? ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా: బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పంచతంత్ర కథలు

అనగనగా పాటలీపుత్రం అనే పట్టణం వుంది. దానికి సుదర్శనుడు రాజు. ఆయనకు ముగ్గురు కుమారులు. వారికి ఆటలంటే బోలెడంత ఇష్టం. కాని చదువుమీద శ్రద్ధ వుండేదికాదు. ఎప్పుడూ ఆటలతోనే గడువుతుండేవారు. దాంతో మూర్ఖులుగా తయారయ్యారు. ఇది సుదర్శనుడికి బాధ కలిగించింది. మనిషికి విద్య వల్ల కీర్తి, సుఖ శాంతులు కలుగుతాయని విశ్వసించే వ్యక్తి ఆయన. ఎలాగైనా తన కుమారులకు విద్యఅబ్బేట్టు చూడాలని పండితులందరిని పిలిపించాడు. వారిలో విష్ణుశర్మకూడా వున్నాడు. పండితులంతా రాకుమారులకు చదువుచెప్పడం తమ వల్ల కాదన్నారు. అప్పుడు రాజుగారు విష్ణుశర్మ వైపు తిరిగి ' పండితవర్యా! నా కుమారులు విద్య నేర్వక పరమ మూర్ఖులయ్యారు. వారికి మీరే విద్యాబుద్ధులు నేర్పాలి. మంచి నడవడిక, లోకజ్ఞానం కలవారిగా తీర్చిదిద్దాలి. అది మీ వల్లే అవుతుంది. ప్రయత్నించగలరా?' అని దీనంగా అర్థించాడు.

అప్పుడు విష్ణుశర్మ 'మహారాజా ! అదెంతపని? మీ కుమారులకు మీరు కోరుకున్నట్టుగా విద్య, లోకజ్ఞానం, మంచి నడవడిక నేర్పుతాను. ఎంత గొప్ప వజ్రమైనా సానబెట్టకుండా ప్రకాశించదు. పిల్లలు ఎటువంటివారైనా తగిన శిక్షణ లేకపోతే రాణించరు. మరో ఆరుమాసాల్లో వారికి విద్యాబుద్ధులు నేర్పుతాను' అన్నారు.

విష్ణుశర్మ మాటలకు సుదర్శనుడు ఎంతో సంతోషించాడు. తన కుమారులను విష్ణుశర్మకు అప్పగించాడు. ఆయన ముగ్గురు రాకుమారులను తన వెంట తీసుకెళ్లాడు. చల్లటి చెట్ల నీడన కూర్చోబెట్టాడు. అయితే వాళ్లను అక్షరాలు దిద్దమనలేదు. శ్లోకాలు చెప్పమనలేదు. చక్కటి కథలు చెప్పాడు. ఆ కథలే పంచతంత్ర కథలుగా పేరుగాంచాయి.

ఈ కథలు విని ఆ రాజకుమారులు మంచి ప్రవర్తనను అలవరచుకున్నారు. ఆ కథలను ప్రతివారం చెప్పకుందాం. మరి చదువుతారుగా. మీ స్నేహితులకు కూడా చూపించండే.

ముళ్లపంది

చర్మంపై ముళ్లున్న జీవులు చాలా వున్నాయి. మనం అన్నిటినీ ముళ్లపందులనే అంటున్నాం. అటువంటి ఒక జీవి హెడ్జ్ హాగ్. ఇది ఒక చిన్న క్షీరదం. పిల్లలను కని పాలిచ్చి పెంచుతుంది. ఇది సుమారు 25 సెంటీమీటర్ల పొడవుంటుంది. కాళ్లు, తోక పొట్టిగా వుండే ఈ జీవి ముక్కు పొడవుగా వుంటుంది. దీని చర్మంపై సన్నని ముళ్లుంటాయి. ప్రమాదం ఎదురైనప్పుడు ఈ జీవి గుండ్రంగా చుట్టుకుంటుంది. అప్పుడే పుట్టిన ముళ్లపందులకు ముళ్లు చర్మం లోపల వుంటాయి. ఇవి బొరియల్లో నివసిస్తాయి.



కె.ప్రవీణ్, 10వ తరగతి,
హరిపాలెం,
విశాఖ.

అంతటి జ్యోతి, 9వ తరగతి,
వెలిమినేడు,
నల్లగొండ.

చిన్నారి చిత్రకారులు



టి.జగదీష్, 5వ తరగతి,
జమిస్తాన్‌పూర్,
హైదరాబాద్.

కె.పి.కుమార్,
10వ తరగతి,
హరిపాలెం,
విశాఖ.

క్విజ్-87

1. జీవనది ఏది?
   ఎ. గంగ బి. గోదావరి
2. గోళాకారంగా వున్న భూమికి నమూనా ఏది?
   ఎ. పలక బి. గ్లోబు
3. చర్మంపైనున్న రంధ్రాలు ఏవి?
   ఎ.స్వేద రంధ్రాలు బి. స్వేదగ్రంథులు
4. నోటిలో ఊరే జీర్ణరసం ఏది?
   ఎ. పైత్య రసం బి. లాలాజలం
5. ధాన్యాలలో ఏం చేరడం వలన బూజు పడతాయి?
   ఎ. తడి బి. ఉప్పు
6. చెట్టు తొర్రలో గూడు కట్టుకునే పక్షి ఏది?
   ఎ. వడ్రంగి పిట్ట బి. పాలపిట్ట
7. రోమన్ సంఖ్య 'D' అనగా...?
   ఎ.500 బి. 100
8. ఇంగ్లండ్‌లో ఎండాకాలమైతే అమెరికాలో....?
   ఎ.ఎండాకాలమే
   బి. వానాకాలం
9. యునిసెఫ్ ప్రధాన కార్యాలయం ఎక్కడ వుంది?
   ఎ.న్యూయార్క్
   బి.జెనీవా
10. ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?
   ఎ.తస్లీమా నస్రీన్
   బి. షబానా అజ్మీ



రెండూ ఒకటే...!

హాయ్! గతవారం మేజిక్ ఎలా వుంది? మీరు ఊహించనదంతా తప్పని తేలిందా? మరి ఈ వారం కూడా మీ కళ్లను భ్రమపెట్టే మేజిక్ ఒకటి చెప్తాను. నా ప్రశ్నలకు జాగ్రత్తగా సమాధానం చెప్పాలి. ఓకేనా.

పైన రెండు టేబుళ్లు వున్నాయికదా. ఆ రెంటిలో ఏది పెద్దదనుకుంటున్నారు? 'అబ్బా! పోయినవారంకూడా ఇలాంటి ప్రశ్నే అడిగారు. మళ్లీ ఈవారం కూడా అడుగుతున్నారు. మాకు భలే కోపం వస్తోందండీ' అంటున్నారా? మీరు ఇలా అనుకోవడం ఏం బాలేదు. ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పండి. పై టేబుళ్లలో ఏది పెద్దది? 'అదేనండి. సన్నగా పొడవుగా వుండే అది. ఈసారి మేమే గెలుస్తాం. మా జవాబే.సరైనది' అంటున్నారు చాలామంది నేస్తాలు. కానీ చిన్నారులూ.. ఈసారికూడా పప్పులో కాలు వేశారుగా. స్కేలు తీసుకొని కొలిచి చూడండి.

మేజిక్ మేజిక్!!

ఏంటి కొలిచారా? ఏమని తేలింది. రెండిటి పొడవులు, వెడల్పులు ఒకటిగానే వున్నాయికదూ. మరి మన కళ్లు మనలను మోసం చేయడమంటే అదే. వచ్చేవారం మరో మాంచి మేజిక్ చెప్పకుందామే.

చుక్కలు కలుపుతారా



"పన్నేండేళ్లు కూడా నిండని ఆ బాలుడు రిక్షా తొక్కుతున్నాడు... అదికూడా ఒంటికాలితో... అతన్ని చూస్తున్నవారంతా ఏం కష్టం వచ్చిందో, ఇంత చాకిరీ చేస్తున్నాడు అనుకుంటున్నారు. కానీ అతని తపన అంతా చదువుకోసమే. పేదరికం పొమ్మన్నా... అంగవైకల్యం అడ్డుపడినా... ఆత్మవిశ్వాసమే ఊపిరిగా అతను పట్టువీడని విక్రమాదిత్యునిలా రిక్షాతొక్కూతూ చదువుకుంటున్నాడు. తన చదువు కోసమే కాకుండా కుటుంబానికి కూడా ఎంతో కొంత ఆధరాంగా మారాడు. జీవితంలో ఏమీ సాధించలేమంటూ కుమిలి పోయేవారికి, ఆత్మహత్యలకు పాల్పడే వారికి ఈ బాలుడి జీవితం ఆదర్శనీయం."

చదువుకోసం ఆరాటం ఒంటికాలితో పోరాటం

బడి మానేసిన బాలల కోసం చదువుల పండుగ జరుపుతున్నారు. బాలకార్మికవ్యవస్థ నిర్మూలిస్తామని, వికలాంగులకు అన్ని విధాలా సాయపడతామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. అయితే పాలకుల వాగ్దానాలు, హామీలు తెలియని ఆ 12 ఏళ్ళ బాలుడు సాగిస్తున్న జీవనపోరాటం, చదువు కోసం పడుతున్న ఆరాటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. నిత్యం రోడ్డుమీద ఒంటికాలితో రిక్షా తొక్కుతున్నా ప్రజాప్రతినిధులకు గాని, అధికారులకు గాని ఆబాలకార్మికుడి కష్టాలు, కృషి, పట్టుదల కనిపించకపోవడం విచారకరం.

"కృషి ఉంటే మనుషులు రుషుల వుతారు... మహాపురుషులవుతారు..." అన్నాడు ఓ కవి. చదువుకోవాలనే అతని ఆరాటానికి పేదరికం, అంగవైకల్యం ఏమాత్రం అడ్డంకి కాలేదు. పేదరికం తన చదువుకు ఆటంకంగా మారుతుందేమోననే భయంతో కృత్రిమ కాలు ఏర్పాటుచేసుకుని ఖాళీ సమయాల్లో రిక్షా తొక్కుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూనే చదువును కొనసాగిస్తున్నాడు 12 సంవత్సరాల దాసరి పొట్టి కోటయ్య. గుంటూరు జిల్లా నిడుబ్రోలులో రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ పూరిగుడిసెలో నివసించే దాసరి వెంకయ్య, దాసరి చిట్టెమ్మలకు ఆరుగురు సంతానం. వీరు పాచిపనిచేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. అందరి కంటే చిన్నవాడు పొట్టికోటయ్య(12). అతని అన్నలు, అక్కలు కూడా కూలి పనులు చేసుకుంటూ వేరుగా జీవిస్తున్నారు. కోటయ్య మాత్రం తల్లిదండ్రులతోనే ఉంటున్నాడు. అతనికి చదువు పట్ల అమితమైన ప్రేమ. తాగిన మైకంలో ఓ డ్రైవర్ లారీని ఇంటి ముందు ఆడుకుంటున్న కోటయ్యపైగా పోనిచ్చాడు. ఈ ప్రమాదంలో కోటయ్య ఎడమకాలు దెబ్బతింది. మెరుగైన వైద్యం చేయించేందుకు ఆర్థికస్తోమత లేకపోవటంతో ఓ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. సరైన వైద్యం అందకపోవటంతో ప్రాణానికే ప్రమాదంగా పరిణమించింది. దాంతో మోకాలి వరకు తొలగించారు. అతని చదువుకు ఆటంకం కలుగుతుందని భావించి, కొంతమంది దాతల సహకారంతో చెక్క కాలు చేయించుకుని ఇంటికి సమీపంలోని ఆదికుమార్ మెమోరియల్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివాడు. మంచి మార్కులు సాధించాడు. కుటుంబ పోషణ భారంగా మారటంతో చదువుకు స్వస్తిచెప్పించి కోటయ్యను కూలిపనికి పంపించాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఆ నిర్ణయాన్ని ఎదిరించి అతను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేరాడు. ఏ రోజూ స్కూలుకు డుమ్మా కొట్టకుండా వెళుతూ శ్రద్ధగా చదువును కొనసాగిస్తున్నాడు. రిక్షా అద్దెకు తెచ్చుకుని స్కూలు వదిలిన తరువాత, సెలవు దినాల్లో ఒంటి కాలితో దానిని నడుపుతూ తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్నాడు. చదువులోనేగాక ఆటపాటల్లోనూ పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. పరుగుపందెం, వాలీబాల్ వంటి ఆటల్లో పాల్గొనడమే కాకుండా డ్యాన్స్ బేబీ డాన్స్‌లో కూడా పాల్గొంటున్నాడు. గత ఏడాది ఓ ప్రయివేట్ పాఠశాల నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలో పాల్గొని ప్రథమ బహుమతిని పొందాడు. అతని కృషి, పట్టుదలకు ప్రభుత్వంగానీ, స్వచ్ఛంద సంస్థలుగానీ చేయూతనిస్తే మరిన్ని ఫలితాలను సాధించే అవకాశముందని నక్కాలు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. అనేక జన్మభూమి సభల్లో తనగోడును అధికారులకు విన్నవించిన పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. వికలాంగులకు, పేదలకు ఇచ్చే రాయితీల్లో భాగంగా అతనికి కనీసం బస్సు పాస్‌కూడా ఇవ్వలేదు. ఈ విషయమై అధికారులను అడిగితే మీరు అగ్రకులాల జాబితాలో ఉన్నారు, సాయం చేయటం కుదరదని చెప్పి చేతులు దులుపుకున్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా తన చదువును కొనసాగించాలని కోటయ్య కృతనిశ్చయంతో ఉన్నాడు. అయితే రిక్షా తొక్కగా వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం యజమానికి చెల్లించాల్సి రావడంతో ఎంత కష్టపడినా పెద్దగా మిగలడంలేదు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి స్వంత రిక్షా అమర్చకపోతారా అని 12 సంవత్సరాల పొట్టికోటయ్య ఎదురు చూస్తున్నాడు. అతని ఎదురుచూపులు, ఆశ, ఆశయం నెరవేరతాయని ఆశిద్దాం.



- మహ్మద్ జిలాని, పొన్నూరు

✻ అంపశయ్య నవీన్

మనమే అలా తయారు చేశాం...

"ఎక్కడికో వెళ్ళొస్తున్నట్టున్నారు?"

"ఇక్కడో సభ జరిగిందిలే..."

"ఏమిటో ఆ సభ?"

"జండర్ స్పృహను గూర్చిన సభన్నారు"

"జండర్ స్పృహా? అదేమిటి?"

"వీళ్ళు స్త్రీలు, వీళ్ళు పురుషులు అన్న స్పృహ"

"అంటే?"

"స్త్రీలు స్త్రీలుగానూ, పురుషులు పురుషులుగానూ ఎందుకుంటున్నారు అన్న స్పృహన్నమాట!"

"నువ్వు చెప్పేది నాకేమీ అర్థం కాలే..."

"ఇప్పుడు మన సమాజంలో స్త్రీలున్నారా? స్త్రీలంటే ఇట్లా ఉండాలని మనం కొన్ని సూత్రాల్ని విధించామా?... పురుషుడికో నీతిని, స్త్రీకో నీతిని అమలు పరుస్తున్నామా?... స్త్రీ తిరిగి చెడింది, పురుషుడు తిరక్క చెడ్డాడు అన్నామా?"

"అన్నాం... అంటే ఏం?"

"అట్లా అన్నందుకు స్త్రీలిప్పుడు తిరగబడ్తున్నారు.. స్త్రీకో నీతినీ పురుషుడికో నీతిని విధించడం అన్యాయం అంటున్నారు. స్త్రీలక్కూడా పురుషులతో సమానమైన హోదా కల్పించాలంటున్నారు"

"స్త్రీలు, పురుషులు సమానమెట్లయితరు? వాళ్ళ పిచ్చిగాకపోతే..."

"ఎందుకు సమానం కారు? వాళ్ళూ మనుషులే, మనమూ మనుషులమే..."

"కాదు... వాళ్ళు స్త్రీలు, మనం పురుషులం.."

"అయితే?"

"మనం పురుషులం కాబట్టి మనం ఏం చేసినా చెల్లుతుంది... అది స్త్రీలకెట్లా చెల్లుతుంది."

"ఎందుకు చెల్లదు?"

"పురుషుడు ఏ అర్థరాత్రయినా, అపరాత్రయినా ఎక్కడికైనా వెళ్ళి రాగలడు... అదే స్త్రీ అయితే అలా వెళ్ళి రాగలుగుతుందా?"

"స్త్రీలు అలా వెళ్ళి రాగలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టవుతుందని గాంధీగారు చెప్పలేదా?"

"గాంధీగారు చాలా చెప్పారు.. ఆయన చెప్పినవన్నీ మనం చేశామా? చేస్తున్నామా? నన్నడిగితే స్త్రీలకిప్పుడేం తక్కువయిందంటాను".

"ఏమీ తక్కువ కాలేదంటావా?"

"కట్నం తేలేదని భార్యల మీద కిరోసిన్ పోసి తగులబెట్టటం, నిస్సహాయంగా వున్న అమ్మాయిలనెందర్నో రేప్ చెయ్యడం, ఆడపిల్ల పుట్టబోతున్నదని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడటం.. ఇదంతా ఏమిటంటావు?"

"ఇదంతా మామూలేకదా... మా అమ్మాయికి మంచి మొగుడు, బాగా డబ్బున్న మొగుడు దొరకాలని ఆడపిల్లల తల్లిదండ్రులే పెద్ద ఎ ద కట్నాలిస్తామని

ఆశపెడ్తారు. అది ఇవ్వనప్పుడు మొగుళ్ళకు కోపాలు రావడం సహజమే కదా... తండ్రి ఆస్తిలో ఎంతోకొంత ఆడపిల్లలక్కూడా చెందాలెకదా... కాబట్టి కట్నం ఇస్తే తప్పేం ఉంది"

"తండ్రి ఆస్తి కూతుళ్లక్కూడా చెందాలని ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చట్టం చేశారు కదా... దాంతో వరకట్నం సమస్య తీరిపోతుందనుకున్నారు కదా..."

"చట్టాలు చెయ్యగానే సరిపోయిందా? అవి అమలవుతున్నాయా లేదా అని చూసే నాథుడి ? మన సమాజంలో చట్టం కంటే సంప్రదాయమే బలంగా ఉంది కదా.."

"తండ్రి ఆస్తిలో కూతుళ్ళకక్కూడా సమానమైన వాటా ఉందన్న సంగతింకా చాలా మంది కూతుళ్ళకు తెలియనే తెలీదు.. అలాంటి చట్టం వచ్చినట్లు జరగాల్సినంత ప్రచారం జరగనే లేదు..."

"ఆడవాళ్ళిప్పుడు బాగా చదువుకుంటున్నారు కదా... ఎన్నో ఉద్యమాలు చేపడ్తున్నారు కదా.. ఇలాంటి చట్టమొకటుందని వాళ్ళు ఊరూరు తిరిగి చెప్పరెందుకు? స్త్రీవాద ఉద్యమ నాయకులు ఎంతసేపు పురుషుల్ని తిట్టిపోయడానికే తమ కాలాన్నంతా వృథా చేస్తున్నారు..."

"ఈ మధ్య టీవీల్లో వస్తున్న సీరియల్స్ చూస్తున్నారా?"

"నాకంత తీరికెక్కడేడ్చింది... మా ఆవిడ చూస్తుంటుంది... ఏమిటి విశేషం?"

"నేను కొన్ని సీరియల్స్ చూస్తున్నాలే... ఆ సీరియల్స్‌లో ఆడవాళ్ళను పరమ దుర్మార్గులుగా చూపిస్తున్నారు.. అత్తమీద కోడలు, కోడలు మీద అత్త.. వదినెల మీద ఆడబిడ్డలు, ఆడబిడ్డల మీద వదినెలు... అక్క మీద చెల్లెలు, చెల్లెలు మీద అక్క... కుట్రలూ, కుతంత్రాలు పన్నడం... భర్తలకు ఇద్దరు భార్యలుండటం.... వాళ్ళు అనుక్షణం ఒకర్ని దెబ్బతీయడానికి మరొకరు ఎత్తుకు పై ఎత్తు వెయ్యడం... ఏ సీరియల్ చూసినా ఇదే వాతావరణం..."

"ఆడవాళ్ళని ఇంత బ్యాడ్‌లైట్‌లో చూపిస్తున్న సీరియల్స్‌ని ఆడవాళ్ళే అపురూపురుమంటూ చూడటం ఆశ్చర్యంగా లేదూ? స్త్రీలకేదో అన్యాయం జరుగుతున్నదని వీళ్ళు ఉద్యమాలు చెయ్యడం హాస్యాస్పదంగా లేదూ?"

"స్త్రీల ఉద్యమాలను గూర్చి నువ్వు మరీ తక్కువ చేసి మాట్లాడుతున్నావు...."

"నేను తక్కువ చెయ్యడం కాదు...వాళ్ళను వాళ్ళే తక్కువ చేసుకుంటున్నారేమోనని నాకనిపిస్తున్నది.... డబ్బు కోసం, పేరు కోసం వాళ్ళు ఎంతటి నీచానికైనా దిగజారటానికి సిద్ధంగా ఉంటారనిపిస్తున్నది... ఇప్పుడొస్తున్న సినిమాలు చూడండి.. హీరోయిన్ ఒంటిమీద బట్టలుంటున్నాయా? యాడ్స్‌లో కనిపిస్తున్న మోడల్స్‌ని చూడండి.. శరీరాల్ని అమ్ముకుంటున్నారు..."

"వాళ్ళని మనవే అలా తయరు చేశామేమోనని నాకనిపిస్తున్నది. ఈ మార్కెట్ ఎకానమీ, ఈ గ్లోబలైజేషన్, ఈ లిబరలైజేషన్... ఈ పాశ్చాత్య నాగరికతను గుడ్డిగా దిగుమతి చేసుకోవడం.. వీటి ద్వారా మనమే మన స్త్రీలను మార్కెట్‌లోని వస్తువుల్లా తయారు చేశాం....."

అద్భుత ధరలు...

అక్షరాలను-

ఆఫ్టరాల్ అక్షరాలే కదా అనుకోకూడదు!

తుడిచేస్తే చెరిగిపోతాయని కూడా అనుకోకూడదు!

అనుకోడం వరకు సుఖంగానే వుంటుంది!

కానీ - ఆ పని అనుకున్నంత సులువు కాదు!

మనం అన్నమాట అక్షరాల్లోగానీ ఇతరత్రా గానీ రికార్డు కాకపోతే - నోటికొచ్చింది మాటాడవచ్చు. నిన్న అన్నమాటని నేడు అనలేదని గదమాయించవచ్చు. నేను అట్లా అనలేదు. ఇట్లా అన్నానని సవరణ చేసి చెప్పి సెభాషనిపించుకోవచ్చు!

అక్షరాల్లో కమిటైపోతే మాత్రం ఇక అంతే సంగతులు!

దస్తావేజు సాక్షి సంతకాలతో సహా సిద్ధంగా వుంటుంది!

అనేక విషయాలను - సందర్భానుసారంగా - అనేక రకాలుగా ముచ్చటించుకుంటాం. నిన్నటి వాతావరణం అనుకూలంగా వుంది గనక మనం రెచ్చిపోయి కొన్ని సుభాషితాలు సెలవిస్తాం!

ఇవాళ్టి వాతావరణం ముదనష్టంగా మారినప్పుడు - నిన్నటి సుభాషితాలు మాటేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే - ఆ టైపు సుభాషితాలు నేనెప్పుడూ చెప్పలేదని బుకాయించే ప్రయత్నం చేస్తాం!

మనం చెప్పింది అక్షర రూపంలో లేదు గనక బతికిపోతాం! మనం ఏమి చెప్పినా చెల్లుబడి అవుతుంది!

మన అభిప్రాయం అక్షరాల్లో మనవి చేసుకున్నప్పుడు మాత్రం కొన్ని ఇబ్బందులు తప్పవు. తట్టుకోవాలి!

గత సంచికలో-

'నారద సలహా' అని సంసార పక్షమైన స్వాభిప్రాయాన్ని 'ఇంతిసంగతులు' శీర్షికలో వెల్లడించేను. ఇప్పుడు వ్యాసం నన్ను ఇబ్బంది పెడుతోంది!

జీవిత సత్యాలను సరదాగా చెప్పాలనే సిద్ధాంతం పట్ల నాకు గురిగౌరవాలెక్కువ. అంచేత ఎంత కఠోర సత్యాన్నైనా కటువుగా చెప్పలేను!

అట్నుంచి నరుక్కొచ్చి అవును సుమా అనిపించడం పట్ల నాకు ఎక్కువ ఇష్టం! అందుకే గత సంచికలో 'నారద సలహా' ఆ టైపులో రాసేను!

అందులో కూడా జీవిత సత్యమే చెప్పేను. సరదాగానే చెప్పేనని ఇప్పటికీ అనుకుంటున్నాను. పాయింటు సింపులే! మార్కెట్లో పది రూపాయలకు కొన్న వస్తువుని రేటు తగ్గించి ఇంటో చెప్పమనే పాయింటు 'నారద సలహా'లో రాసుకున్నాను!

ఆడవాళ్ళు ఆనందించాలంటే - సదరు భర్తలు ఇల్లాంటి గిమ్మిక్కులు చేస్తారని చెప్పేను. ఒక పాఠక మహాశయుడు - పేరూ ఊరూ అప్రస్తుతం - నారద సలహా చదివి ఉత్సాహం తెచ్చుకుని మార్కెట్టు నుంచి తెచ్చిన వస్తువుల ధరలు భారీ ఎత్తున తగ్గించి చెప్పేట్ట! ఆవిడ గారు భర్త తాలూకు బేరం మెచ్చుకున్నారుట కూడాను. రెండోరోజు - ఆ వస్తువులను ఆయన చెప్పిన పరమ చవక ధరల చొప్పున పక్కింటి వారికి సగం పంచేసిందిట వారి అర్ధాంగి. మీ తప్పుడు స్టేటుమెంట్లూ, చిట్కాలూ చదివి ఆచరించినందుకు తలబొప్పి కట్టిందని నన్ను ఫోన్లో తిట్టిపోసేరు. ఇకముందు తప్పుడు రాతలు రాయవద్దని మందలించేరు!

కొన్న ధర కొంచెం తగ్గించి ఇంటో చెప్పే మగవాళ్ళను ఒక కంట కనిపెట్టుకునుండండని రాసిన మాట నిజమే! అంతేగాని అరవై రూపాయలకు కొని ఆరు రూపాయలకే తెచ్చేనని అద్భుతరేట్లు ఇంటో చెప్పమని ఆయనకు ఎవరు సలహా ఇచ్చేరో ఏమో! ఆడవాళ్ళ జాలిగుండెలు! ఇరుగుపొరుగుని ఆదుకోవాలనే ధర్మ సూత్రానికి కట్టుబడి వుంటారు! ఈ సృష్టి రహస్యం మగాళ్ళంతా జ్ఞాపకం పెట్టుకోవాలి. అందువల్ల ఒకటి రెండు రూపాయల స్థాయిలు తగ్గించి ఇంటో చెప్పి వుంటే - ఇంత రభస జరిగి వుండేది కాదుగదా!

ఈపాటి తగ్గింపు ధరతో పక్కింటి పిన్నిగారికి భాగమిచ్చినా ఏమంత నష్టమనిపించదు. పైగా - ఫలానా మీనాక్షి భర్త ప్రతి వస్తువూ చవగ్గా తెస్తాడు సుమా అని అందమైన ప్రచారం కూడా జరుగుతుంది!

అంతేగాని -

పరమ చీపురేట్లు ఇంటో చెబితే - ఆ ఇంటి ముందు ఆడవాళ్ళంతా తలో సంచీతో క్యూలో నిలబడతారు!

మీ వారితో మాకు కంది పప్పు అద్భుత రేటులోనే తెప్పించమని ఇండెంట్లు పెడతారు! పక్కింటి పిన్నిగారికేం తెలుసు శ్రీవారి చవక లీలలు?

అంచేత -

అలాగలాగే అని అడిగిన వారందరికీ వరాలిస్తుంది! భర్త చేతిలో సంచులు పెట్టి అద్భుత రేటులోనే కందిపప్పు పట్టుకురమ్మని ప్రాధేయపడుతుంది!

పరమ చవకరేట్లు చెప్పి కమిటైపోయిన పాపానికి సదరు భర్త కన్నీరు పెట్టుకోవడం మామూలైపోతుంది. సంచి ఒక్కింటికి ఆరు రూపాయలు మాత్రమే వసూలు చేసి అరవై రూపాయల రేటుతో కంది పప్పు తీసుకురావాలి. అతను తెచ్చేకొద్దీ సంచుల సంఖ్య పెరిగిపోతూ వుంటుంది!

నెల తిరక్కుండానే -

శ్రీవారి ప్రావిడెంటు ఫండు మొత్తం కంది పప్పుకే ఖర్చయిపోతుంది. చివరికి చేతికి చిప్పా, నెత్తిన ముసుగూ మిగుల్తాయి! అంచేత ఆడవాళ్ళతో ఆడుకోకూడదు. మగాడు కుట్రలూ ట్రిక్కులూ వాళ్ళకి తెలీవు. నల్లనివన్నీ నీళ్ళూ, తెల్లనివన్నీ పాలనుకుంటారు!

తన భర్త యొక్క చవక ప్రత్యేకత తోటి మహిళామణుల్తో చెప్పి సెభాషనిపించుకోడం వాళ్ళకి ఇష్టమైన హాబీ! ఈ ఫిలాసఫీ నాకు ఫోను చేసిన పాఠక మహాశయుడు ఇప్పటికైనా గమనిస్తే ఆనందం!

*రుక్మిణి

డబ్బు-దేవుడు-డ(దే)బ్బ(వుడు)

నేను వెళ్ళేసరికి సోఫాలో అద్వానంగారు కూర్చుని వున్నారు. అయితే మనిషి మాత్రం తీవ్రమైన ఆలోచనలో మునిగిపోయినట్లున్నాడు - నుదుటి మీద మడతలు మడుచుకుని పోయి వదనంలో ఆలోచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"కూర్చో" గంభీరంగా కుర్చీ చూపించారు. నేను 'వుస్సు'రని కూలబడ్డాను. నాలో వుత్సుకత ఎంతయినా మహా మూర్ఖపు జాతికి చెందిన వాడినాయె! జ్ఞాన సముద్రంలో మునకలు కాదుగదా చెంబెడు నీళ్ళతో మొహమైనా కడుక్కోని అమాయకపు అజ్ఞానిని గదా! మరి వారో.... అబ్బో... సర్వశాస్త్రాలు ఔపోసన బట్టి నాలాంటి మూర్ఖులకు జ్ఞానోపదేశం చేయగల త్రికాలజ్ఞులు గదా!

"ఏంటయ్యా... ఏంటి సంగతులు.. సందేహాలు!" అద్వానంగారు అడిగారు.

"అబ్బే... ఏంలేదుసార్... నాకీ మధ్య ఒక ప్రశ్న వూరికే మెదళ్ళో జొరబడి తొలిచి పారేస్తోంది. ఎంతయినా అజ్ఞానుడ్నిగదా.." ఆయనగారు మందహాసం చేసి 'అడుగు... అడుగు' అని ప్రోత్సహించాడు.

"ఏంలేదుసార్... 'మనిషికి కావలసింది డబ్బా-దేముడా?" నేను చాలా లోగొంతుకతో అడిగినా ఆయనగారు జేబులో బాంబు పేలినట్లు తత్తరపడి తెప్పరిల్లాడు - అసహనంగా అటు ఇటు కదిలాడు.

"అబ్బాయీ.. నువ్వు అడిగిన ప్రశ్న బహు సంక్లిష్టం... సంకీర్ణం... వేద మూలాల్లోకి వెళితేగానీ సమాధానం దొరకదు..."

"మూలాలూ.. శూలాలూ నాకు పట్టవు సార్.. ఏదో అజ్ఞానం..." నా మాటలని మధ్యలోనే తుంచిపారేసి "అవును-మీవంటి మహామూర్ఖులుండడం వల్లనే ఈ ప్రపంచం ఇట్లా తగలబడింది - మీరు అసలు దైవచింతన, భగవంతుని పట్ల ధ్యాస లేకపోవడం వల్లనే మీరిట్లా నాస్తికులుగా, కుహనా లౌకిక వాదులుగా తయారైనారు".

"అంటే?" నేను భయపడుతూనే అడిగాను. ఆయనగారు మండిపడ్డారు. "దైవభక్తులనూ... పవిత్రులనూ ఆదరించి వారికి వత్తాసుగా వుండవలసింది పోయి, మ్లేచ్ఛులతో, పరమ నాస్తికులతో మీవంటి 'మంచివాళ్ళు' చేతులు కలుపుతున్నారు. భక్తులకు దేన్లోనైనా 'విజయం' చేకూర్చగల మీలాంటి వారే వారిని దుయ్యబడుతున్నారు"

నాకంతా అయోమయమైపోయింది. ఈ భక్తులెవరు? వ్లేచ్ఛులు... లుచ్ఛాలెవరు? సాయం..విజయం... నాస్తికులు అంటాడేం? ఈ మాటల్లో కొన్ని పైనే అనేశాను.

"సర్సరె... ముందు నీ ప్రశ్నకు సమాధానం... అడిగావుగా... 'డబ్బా... దేవుడా'... అని! "డబ్బు దేవుడు కాదు - కాని డబ్బు దేవునికన్నా తక్కువని కాదు సుమా"! అన్నాడు. నా మెదడులో బల్బు వెలిగింది!

"అవున్సార్.. ఎవరో కేంద్రమంత్రి 'లంచం' అదే 'ముడుపులు' పుచ్చుకుంటుండగా వీడియోలో చిక్కిపోయాడు. అపుడు సరిగ్గా ఇదే మాట అన్నాడు. అవునవును... అదే... ఎవరబ్బా...!"

ఆయనగారు అగ్ని పర్వతంలా పేలబోయి నిబాయించుకుని 'నీచుడా... ఒక పరమ పవిత్రమైన కూటమికి చెందిన దేశభక్తుడ్ని 'లంచం' తీసుకున్నాడూ... ముడుపులు స్వీకరించాడూ అని అంటావా... ఎన్ని గుండెలు...

"మరి ఏమనాలి సార్!" అమాయకంగా తెల్లబోతూ అన్నాను.



"అదంతా ఈ కుహనా లౌకిక వాదుల దుర్మార్గపు కుట్రగా... నీచ రాజకీయాల్లోని ఒక ఎత్తుగడగా భావించి - నమ్మి.. అందర్ని నమ్మించడానికి మీరు వూదర పెట్టాలి! అంతే"!

"ఈ వూదర - వూదర గొట్టం నీకేం తెలుసుగానీ.. అసలు ఈ యుగంలోనే ధర్మం, నీతి నాశనమై పోయాయి సార్... దేశ రక్షణ కోసం ఇతర దేశాల నుండి ఆయుధాలు కొంటే దాన్లో ముడుపులు... శవపేటికల కొనుగోళ్ళలో కమీషన్లు... హవ్వ.. ఛ....!"

ఆయనగారు దిగ్భ్రమగా చూశారు... నన్ను నమిలి మింగేలా చూస్తున్నారు. గానీ మనిషి ముళ్ళడొంకలో దూరినట్లు... నన్ను కఠినంగా చూస్తున్నారు.. నేను నీళ్ళు నమిలాను.

"మూర్ఖుడా... ఒక గొప్పయాగం.. అదే పవిత్రయజ్ఞం చేసేటపుడు కొన్ని సమిధల్ని నిరభ్యంతరంగా కాల్చిపారేస్తాం...

"అవునవును... అన్నట్లు పాపం... దేశభక్తుడైన శ్రీబంగారు లక్ష్మణ్‌గారు కూడా అట్లాంటి సమిధే గదా...ప్చ్..."!

ఆయన గారు నుదురు బాదుకుని మరికాసేపు మండిపడ్డారు. "విను... గతించిన విషయాలను వెలికితీసేది నీలాంటి బుద్ధిహీనులే! అలాంటి వారే చివరికి వరాభవాల పాలవుతారు-కావాలంటే పురాణాలు చదువ్..."!

"అంటే అట్లా వురాణాలు.. మరి ముడుపులూ..

"అరె బద్మాష్! పరమ పవిత్ర కార్యానికే నడుం బిగించిన ఆ కూటమి ప్రయత్నాలకు ఇలాంటివి ఏ మాత్రం అడ్డురావు - వాళ్ళను ఏమైనా అంటే కండ్లుపోతాయి... వాళ్ళందరికీ ఆ భగవంతుడే ఈ పుణ్యకార్యాల కోసం జన్మలను ప్రసాదించాడు..

"సరెలెండి... ఇంతకూ అసలు సంగతి మరిచారు. అదే 'డబ్బు-దేవుడు'..! ఆయనగారు కాస్తంత శాంతించారు. "అబ్బాయ్.. ఆ శ్రీరామచంద్రుడే మనకు రక్ష! ఎపుడైనా ఒక చిక్కు సమస్యే వచ్చి మీద పడిందే అనుకో... అపదే పైన పడిందే అనుకో... జైశ్రీరాం... శ్రీరాములు వారికి మేమూ... మాకేమో అయోధ్యా... గుడీ... త్రిశూలాలు వెంటనే గుర్తుకు వస్తాయి. అంతే! ఆయన గతంలో కూడా రామబాణం వేసి ఆదుకున్నాడు. అందుకే ఆయనన్నా.. అయోధ్యా... మందిరం అన్నా మాకు భలే ఇష్టం! దేవుడు చాలా గొప్పవాడు కదా!"

నేను నిర్ఘాంతపోయాను... నా ఒళ్ళంతా కుతకుత వుడికిపోయింది! అయినా తమాయించుకుని నిగ్రహించుకున్నాను.

"మరి డబ్బో... లంచం... ముడుపులు...!" చాలా ప్రశాంతంగానే అనేశాను - ఆయనా శాంతంగానే జవాబిచ్చాడు.

"రామభక్తులు రాముల వారిని సేవించే విషయంలో 'డబ్బు' ప్రాధాన్యత దానిది దానికే వుంటుంది. ఉదాహరణకు 'రామభక్తబృందం' చిరకాలం జీవించి వుండాలంటే 'ధనం' తప్పనిసరిగా అవసరం గదా.. అబ్బాయ్.. నువ్ మాటిమాటికీ ముడుపులూ.. లంచం అని ప్రయోగించకు.... భక్తులకు ఆ దేవుడు అనుగ్రహించే 'ప్రసాదం' అనుకో!" హహ్హహ్హా...!" అని పగలబడి నవ్వసాగాడు.

"ఓహో... అంటే ఇన్ని కుంభకోణాలు.. అవినీతి పనులూ ఆ దేవుడి పేరు మీదనే లాగించి కానిచ్చేస్తారన్నమాట! ఈ రాబోయే ఎన్నికలలో ఓట్లను కొండానికే గదా ఆ ఆస్ట్రేలియా వ్యాపారవేత్తలకు మన స్వదేశీ ఖనిజ సంపదను అడ్డగోలుగా అప్పగించాలని ప్రయత్నం చేసింది. ఒక మాట గురువు గారూ.."

నా తీవ్రతకి రామభక్తులకు డబ్బే ప్రధానం గదా... అదీ దేవుడి కోసం... అందుకే ఆ అయోధ్య స్థలాన్ని కూడా ఏ అమెరికా కార్పొరేట్ కంట్రాక్టరు కంపెనీకో రహస్యంగా అప్పగిస్తే కావలసినంత ధనం.. ఏం ఫర్వాలేదు... ఇటుదేవుడూ సంతోషిస్తాడు.. రామభక్తుల అవసరాలూ తీరతాయి... ఛ... ఛ..."

అట్లా అనేసి నేను వడివడిగా మేడమెట్లు దిగి క్రిందికి వచ్చేశాను! ●

✻ డాక్టర్ పి.దక్షిణామూర్తి

కాలుష్యంతో ఉబ్బసం

అకస్మాత్తుగా ఆయాసం, పిల్లికూతలు, దగ్గుతెర వచ్చి కొంతసేపు బాధించి, దానంతట అది గాని, చికిత్స వల్లగాని తగ్గిపోయే లక్షణాలను 'ఉబ్బసం' (బ్రాంకియల్ ఆస్తమా) అంటారు. అన్ని దేశాలలోను పిల్లల్లో నూటికి సుమారు అయిదుగురికి, పెద్దలలో నూటికి ఒకరిద్దరికి ఈ వ్యాధి వున్నదని సర్వేలలో బయటపడింది. ఇది ఏ వయస్సులోనైనా రావచ్చు గాని, చిన్న వయస్సులో 4-9 సంవత్సరాల మధ్యలో ఎక్కువగా మొదలవుతుంది. 3-4 సంవత్సరాల లోపు కూడా ప్రారంభం కావచ్చు. బాల్యంలో మొదలైన ఉబ్బసం నూటికి 75 మందిలో 18-20 సంవత్సరాలు వచ్చేటప్పటికి తగ్గుముఖం పడుతుంది. 35 సంవత్సరాల తరువాత ప్రారంభమయ్యే ఉబ్బసం రోగిని ఎక్కువ కాలం బాధిస్తుంది.

రాత్రిపూటగాని, తెల్లవారుజామున గాని ఉబ్బసం "తెర" (ఎటాక్) వచ్చినప్పుడు ఛాతీ బిగించినట్టుండడం, ఆయాసం, దగ్గుతో బాధపడుతూ ఊపిరి ఆడకపోవడం జరుగుతుంది. రోగి కూర్చుని ముందుకు వంగడం గాని, గాలికోసం కిటికీ వద్దకు వెళ్ళి రొప్పడం గాని చేస్తారు. అతని ఛాతీలో నుంచి పిల్లికూతల వంటి శబ్దాలు దగ్గర వున్న వారికి వినబడతాయి. ఈ 'తెర' కొన్ని నిముషాల నుంచి కొన్ని గంటల వరకు బాధించవచ్చు. ప్రాథమిక దశలోనే వైద్య సహాయం అందకపోతే 'స్టేటస్ ఆస్తమాటికస్' అనే తీవ్ర దశకు చేరుకోవచ్చు. ఈ దశలో కనీసం మాటలాడలేనంత ఆయాసం, నిస్త్రాణ, మగత, గోళ్ళు, నాలుక నీలం రంగులో వుండడం మొదలైన లక్షణాలు వుండవచ్చు. అటువంటి సమయాలలో అత్యవసర చికిత్స కోసం రోగిని ఆస్పత్రిలో చేర్పించాలి. ఆయాసం తగ్గిన తరువాత కొన్ని వారాలు లేదా నెలల వ్యవధిలో మరల 'తెర' వచ్చే వరకు కొంత మందిలో ఏ బాధా లేకపోవచ్చు. మరికొంత మందిలో ఉబ్బసం లక్షణాలు తగ్గకుండా నెలల తరబడి బాధించవచ్చు (క్రానిక్ ఆస్తమా).



ఇంచుమించు ఉబ్బసం లక్షణాలే వుండే మరొక వ్యాధి 'క్రానిక్ బ్రాంకైటిస్, ఎంఫిసీమా'. దీనినే 'సి. ఓ. పి. డి.' అని కూడా అంటారు. ఎక్కువగా పొగతాగే వారిలో 'స్మోకర్సు' దగ్గుగా ప్రారంభమై, ఉదయాన్నే కళ్ళె ఎక్కువగా పడుతుంది. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాక దగ్గుతో పాటు ఆయాసం రావడం ప్రారంభిస్తుంది. ఊపిరితిత్తులు పెరిగి, తీవ్ర దశలో కొద్దిదూరం కూడా నడవలేని స్థితికి చేరుకుంటారు. ఈ వ్యాధికి పొగతాగడం ఒక ముఖ్య కారణం. పరిశ్రమల వల్ల కలిగే వాయు కాలుష్యం మరొక కారణం.

'ట్రాపికల్ ఇయోసినో ఫిలియా' అనే వ్యాధిలో కూడా దగ్గు, ఆయాసం, జ్వరం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి మొదలైన లక్షణాలు వుంటాయి. ఉబ్బసం వలే దీర్ఘకాలం బాధించకుండా 'హెట్రజాన్' వంటి ఔషధాల ద్వారా కొద్ది రోజుల్లోనే ఈ వ్యాధి తగ్గుముఖం పడుతుంది. పిల్లికూతల వంటి శబ్దాలతో ఆయాసం ఇంకా అనేక వ్యాధుల్లో రావచ్చు. రక్తపోటు, గుండెజబ్బు మొదలైన వ్యాధుల్లో కూడా రాత్రిపూట ఎగశ్వాస, నోటివెంట రక్తపు జీర కలిసిన నురుగు రావడం మొదలైన లక్షణాలు వుండవచ్చు. దీనిని 'కార్డియాక్ ఆస్తమా' అంటారు. ఆయాసానికి కారణమేమిటో నిర్ణయించి డాక్టరు తగు చికిత్స చేస్తారు.

ఉబ్బసం వ్యాధికి కారణాలు అనేకం.

'ఎక్స్‌ట్రిన్సిక్ ఆస్తమా' అనే రకం వంశపారంపర్యంగా రావచ్చు. దీనికి 'ఎలర్జీ' ముఖ్య కారణం. శరీరానికి సరిపడని ప్రొటీను (యాంటిజెన్) శరీరంలో ప్రవేశించినప్పుడు దీనికి ప్రతీకారంగా 'యాంటీబాడీ'లు ఉత్పత్తి అవుతాయి. ఆ వస్తువు తిరిగి శరీరంలో మరోసారి ప్రవేశించినప్పుడు ఆ వస్తువుకు 'యాంటీబాడీ'లకు సంయోగం జరిగి కొన్ని హానికరమైన రసాయనిక పదార్థాలు విడుదలై 'ఎలర్జీ'ని కలిగిస్తాయి. కొన్ని పదార్థాలకు ఉబ్బసం రోగుల శ్వాసకోశం తీవ్రంగా స్పందిస్తుంది. ఇంటిలో దుమ్ము, బూజు కొంతమందికి పడవు. ఇంట్లో బూజు దులిపినప్పుడు, పొలంలో, మిల్లులో వడ్ల బూదర తగిలినప్పుడు ఉబ్బసం కొంతమందికి ఎక్కువ అవడం అందరికీ తెలిసిన విషయమే. కొంతమందిలో ఎరువుల వాసన వల్ల, పెంపుడు జంతువులు, పక్షుల మీద బొచ్చు, ఈకల వల్ల కూడా ఉబ్బసం లక్షణాలు పెరగవచ్చు.



ఆహార పదార్థాలు ముఖ్యంగా పిల్లలలో ఆవుపాలు, కోడిగుడ్డులోని తెల్లసొన, చేపలు, చాక్లెట్లు వంటి తీపి పదార్థాలు, టొమాటో మొదలైనవి ఉబ్బసాన్ని కలిగించవచ్చు. శీతల పానీయాల్లో వుండే 'టార్‌ట్రాజిన్' వంటి రంగు పదార్థాల వల్ల కూడా ఈ వ్యాధి రావచ్చు. యాస్పిరిన్, ఫినైల్ బ్యుటజోన్ మొదలైన నొప్పులకు వాడే ఔషధాల వల్ల కొద్ది మందికే ఉబ్బసం లక్షణాలు తిరగబెట్టవచ్చు. రక్తపోటు, గుండెజబ్బులకు వాడే 'బీటా బ్లాకర్స్' (ప్రొప్రనలాల్ మొదలైనవి) ఉబ్బసం రోగులకు వాడకూడదు. 'నీటి కాలు' అనే కంటి వ్యాధికి వాడే 'బీడా బ్లాకర్' కంటి చుక్కల వల్ల కూడా ఉబ్బసం తిరగబెట్టే అవకాశం వుంది.

కొన్ని వృత్తులలో వారిలో ఉబ్బసం ఎక్కువగా వచ్చే అవకాశం వుంది. పెయింట్లు, వార్నీష్, ప్లాటినం, ప్లాస్టిక్స్, తోళ్ళు, ఊలు మొదలైన వాటిని తయారు చేసే పరిశ్రమలలోను, వాటితో పని చేసే వృత్తులలోని కొంతమందికి ఉబ్బసం రావచ్చు. మబ్బులు కమ్మినప్పుడు, చల్ల గాలులు వీస్తున్నప్పుడు, గాలిలో నీటి ఆవిరి అధికంగా వున్నప్పుడు కొందరిలో ఉబ్బసం తెరలు ఎక్కువగా రావచ్చు. స్థలం మారిస్తే కొంతమంది ఉబ్బసం రోగుల ఆరోగ్య పరిస్థితి మెరుగవుతుంది. ఆందోళన, ఉద్రేకం మొదలైన మానసిక కారణాల వల్ల కూడా ఉబ్బసం తెరలు తరచుగా రావచ్చు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

ఉబ్బసం రోగి ఆహారం తనకు పడని వస్తువులేవో గుర్తించి వాటిని విసర్జించాలి. ఈ వ్యాధిలో 'ఎలర్జీ'ని కలిగించే కారణాలలో ఇంటిలో వుండే దుమ్ము ముఖ్యమైనది. ఇంటి దుమ్ములో వుండే చిన్న పురుగు (డస్ట్‌మైట్) వల్ల ఈ 'ఎలర్జీ' వస్తుంది. ఉబ్బసం రోగి నిద్రించే గదిని శుభ్రంగా వుంచాలి. తివాచీలు, సామాను, పుస్తకాలు వగైరా ఆ గదిలో వుంచకూడదు. గదిని, ఇంటిని కూడా ఊడవడం కంటే, తడిగుడ్డతో తుడవడం మంచిది. దూది పరుపులు, దూది దిండ్లకు బదులు వీలైతే 'ఫోమ్'తో తయారుచేసినవి వాడడం మంచిది. ఫాన్ గాలిలో వుండే దమ్మును పీల్చడం వల్ల కూడా ఉబ్బసం రోగికి రాత్రిళ్ళు ఆయాసం రావచ్చు. శీతాకాలంలో గదిలోకి చలిగాలి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

చలి వాతావరణం, గాలిలో నీటి ఆవిరి అధికంగా వుండే వాతావరణం కొంతమందికి పడనప్పుడు, స్థలం మార్పు చేస్తే సుగుణం కనపడవచ్చు. కొన్ని వృత్తులలో ఉబ్బసం తెరలు తరుచూ వస్తున్నట్టుగా వుంటే వృత్తి మార్పు కూడా అవసరం కావచ్చు. రోగికి పడని వస్తువులేవో నిర్ధారించడానికి 'చర్మ పరీక్ష'లు అవసరం కావచ్చు. ఇంటి దుమ్ము, జంతువుల బొచ్చు మొదలైన 'యాంటిజెన్'లను ఉపయోగించి రోగికి సరిపడనిది ఏదో నిర్ణయిస్తారు. ఈ పరీక్షలకు వైద్యునికి, రోగికీ ఎంతో ఓర్పు అవసరం. అదృష్టవశాత్తు, పడని 'యాంటిజెన్' ఏదో తెలిస్తే, దానిని చిన్న మోతాదులలో క్రమేణా పెంచుకుంటూ పోతే, ఆ 'యాంటిజెన్' వల్ల ఎలర్జీ ఏర్పడకుండా పోతుంది. ఈ ప్రక్రియను 'డీసెన్సిటైజేషన్' అంటారు. ఈ పరీక్షలను 'ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు' చేస్తారు. ఉబ్బసం తెరలు తరచుగా రాకుండా నివారించడం కోసం 'డై సోడియం క్రోమోగ్లైకేట్' ఇన్‌హేలర్స్ ముఖ్యంగా పిల్లల్లో మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఉబ్బసం వున్న పిల్లల్లో కొంతమందికి పరుగెత్తడం వంటి వ్యాయామాల వల్ల ఉబ్బసం తెర రావచ్చు.

నేటి వైద్య శాస్త్రంలో ఉబ్బసం వ్యాధికి బాగా పని చేసే అనేక ఔషధాలు, ఇంజక్షన్లు వున్నాయి. నోటిద్వారా వాడే ఔషధాల కంటే 'ఇన్‌హేలర్లు' (నోటితో లోపలికి పీల్చేవి) వాడడం వల్ల ఉబ్బసం రోగికి ఉపశమనం ఎక్కువ కలుగుతున్నది. బిళ్ళలు ఉపయోగించడం వల్ల వచ్చే దడ, చేతులు వణకడం వంటి దుష్ఫలితాలు 'ఇన్‌హేలర్లు' వాడడం వల్ల వుండవు. వీటిని పీల్చడం వల్ల, ఆయాసాన్ని తగ్గించే మందు సరాసరి ఊపిరితిత్తులలోకి వెళ్ళి పని చేస్తుంది. అలాగే 'కార్టికోస్టిరాయిడ్' ఇంజక్షన్లు, బిళ్ళలు అత్యవసర పరిస్థితిలోనే డాక్టరు వాడతారు. అంతేగాని ఈ మందులను సొంతంగా వాడడం వల్ల అనేక విపరిణామాలు కలగవచ్చు. 'సాల్ బ్యుటమాల్', 'టెర్ బ్యుటలిన్', స్టిరాయిడ్' ఇన్‌హేలర్లను ఎలా ఉపయోగించాలో, రోజుకు ఎన్నిసార్లు ఉపయోగించాలో డాక్టరును అడిగి వివరంగా తెలుసుకోవాలి.

రాబోయే ఉబ్బసం తెర తీవ్రతను ముందే పసిగట్టి తగు జాగ్రత్తలు తీసుకోవడానికి 'పీక్ ఫ్లోమీటర్' అనే సాధనం ఎంతో ఉపయోగిస్తుంది. డాక్టర్ సలహాపై దీనిని రోగి ఇంటివద్ద వాడుతూ, ఆయాసం ఎక్కువ కాబోయే ముందు మందుల మోతాదు పెంచుకోవచ్చు. మందులు, ఇన్‌హేలర్లు తగిన మోతాదులో వాడుతున్నా, ఆయాసం తీవ్రంగా వున్నప్పుడు వెంటనే డాక్టర్ వద్దకు వెళ్ళాలి. దీర్ఘకాలిక వ్యాధి అయిన ఉబ్బసాన్ని అదుపులో పెట్టాలంటే డాక్టరుకు, రోగికి ఇద్దరికీ తగిన ఓర్పు, అవగాహన ఉండాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కూడా పెరుగుతున్న పరిశ్రమల కాలుష్యం వల్ల ఉబ్బసం, బ్రాంకైటిస్ వంటి వ్యాధులు పెరుగుతూ వుండడంలో ఆశ్చర్యమేమీ లేదు. కాలుష్య నివారణకు పారిశ్రామికులు, ప్రభుత్వం తగు కృషి చేయాలి. ●

దానిమ్మతో రొమ్ము క్యాన్సర్ దూరం



మనకు సంవత్సరమంతా లభించే పళ్ళలో దానిమ్మ ఒకటి. ఇటీవల ఎర్రటి, ఆకర్షణీయమైన పండ్లు లభిస్తున్నాయి. మన ఆరోగ్య పరిరక్షణలో దానిమ్మ ఎంతగానో తోడ్పడుతుంది. ఇది ఎన్నో విధాలుగా ఆరోగ్యానికి తోడ్పడుతుందని మనకు తెలుసు. అయితే తాజా పరిశోధనల్లో రోజుకు సగం దానిమ్మ చొప్పున రెండు వారాలు తింటే చేదు కొలెస్టరాల్ 90 శాతం కరిగిపోతుందని, రక్తనాళాల్ని బలోపేతం చేసి పెళుసుగా మారకుండా నిరోధిస్తుందని తేలింది. అంతేకాదు, దానిమ్మ, ద్రాక్ష రసాలు ఎక్కువగా తీసుకునే స్త్రీలలో రొమ్ము క్యాన్సర్ తక్కువని కూడా తేలింది.

విద్యాకాషాయీకరణ క్రమానికి అద్దం...

ఏ దేశమైనా అభివృద్ధి కావడానికి ఆ దేశ విద్యా విధానం కీలకం. అయితే పాలక వర్గాలు దాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకోజూస్తాయి. రాజీవ్‌గాంధీ అధికారం చేజిక్కించుకున్న నాడు అమలు జరిపిన నూతన విద్యావిధానం నుంచి వాజ్‌పేయి ఏలుబడిలో విద్యను కాషాయీకరించే వరకు గల పరిణామక్రమంపై 'మార్క్సిస్టు మేధావి, సి.పి.ఎం. పొలిట్‌బ్యూరో సభ్యులు సీతారాం ఏచూరి చేసిన ప్రసంగం భారతదేశ విద్యావ్యవస్థ పేరిట ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన చిన్న పుస్తకం విశేష పాఠకాదరణ పొంది పలువురిని ఆకట్టుకోవడమే గాక రెండు ముద్రణలు పొందింది. నేడు దానికి విద్యారంగ నిపుణులు, మేధావులు, చరిత్రకారులు కె.ఎన్.ఫణిక్కర్, అర్జున్‌దేవ్, ఇర్ఫాన్ హబీబ్, ప్రఫుల్ బిద్వాయ్, ప్రభాత్ పట్నాయక్‌లు రాసిన వ్యాసాలు చేర్చి మరింత ఆకర్షణీయంగా పునర్ముద్రింపబడిన పుస్తకం గురించి తెలుసుకోవలసిన అవసరం వుంది.



పరిణామ క్రమంలో
భారతదేశ విద్యావ్యవస్థ
1833–2003
స్వేచ్ఛానువాదం : డి.ఆర్.కె.రెడ్డి
వెల : రు. 12/–; ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

రాజీవ్ గాంధీ ప్రభుత్వ హయాంలో నాడు నెలకొని వున్న అంతర్జాతీయ పెట్టుబడిదారీ సంక్షోభం, పీకల్లోతులో మునిగి వున్న దేశీయ సంక్షోభాలను అధిగమించడానికి భారతదేశ పాలక వర్గాలు భారీ పెట్టుబడులతో కూడిన సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడవల్సి వచ్చింది. తదనుగుణమైన విద్యావిధానాన్ని నూతన విద్యావిధానం పేరిట ప్రభుత్వం ప్రజల నెత్తిన రుద్దింది. అంటే విద్యావిధానంలో మార్పులు ఎప్పుడైనా పాలకవర్గాల అవసరాల మేరకే జరుగుతాయనే వాస్తవాన్ని అర్థం చేసుకునే వారు చారిత్రక క్రమంలో విద్యావిధానం ప్రస్తుత స్థితికి ఎలా పరిణామం చెందుతూ వచ్చిందీ పరిశీలించడం అవసరం.

మహాభారత కాలం నాటి నుండి విద్య పాలక వర్గాలకు, కులీనులకు, ఉన్నత వర్గాలకు పరిమితమై. శ్రామిక వర్గాలకు తిరస్కరింపబడిందనే విషయాన్ని ఏకలవ్య, కర్ణాదుల ఇతి వృత్తాలు స్పష్టం చేస్తాయి. దీనినే మార్క్స్, ఎంగెల్స్ మాటల్లో చెప్పుకుంటే ఏ కాలంలోనైనా పాలకవర్గ భావాలు పాలించేవారి భావాలే. అంటే సమాజ భౌతిక శాస్త్రాల మీద ఆధిపత్యం వహించిన వర్గం ఆ సమాజ మేధోపరమైన శక్తులపైన కూడా ఆధిపత్యం వహిస్తుంది. అయితే లెనిన్ చెప్పినట్లు పెట్టుబడిదారులు కార్మికులు, రైతులలో చొరవ, ధైర్యాన్ని పెంచాలనుకోరు. ఎందుకంటే పిరికివారు, అమాయకులతో పని చేయించుకోవడం సులువు. కానీ వారికి ప్రాథమిక పరిజ్ఞానం లేనిదే యంత్రాలు, యంత్ర పరికరాలతో పని చేయించుకోలేరు. కాబట్టి సాంకేతిక అభివృద్ధి, విద్యను నేర్చుకోవాలని కార్మిక, రైతాంగం చేసే పోరాటాల మూలంగా వారికీ విధమైన శక్తి, ధైర్యసాహసాలు అలవడేలా చేయడం పెత్తందారు అనివార్యమైంది. ఇందుకుగాను పెట్టుబడిదారీ పద్ధతిలో సమాజాన్ని అదుపులో పెట్టే సాధనంగా నాటి వలస పాలకులైన బ్రిటీష్ వారు ప్రతిపాదించిన విద్యావిధానాన్నే తర్వాత పగ్గాలు చేపట్టిన పాలక వర్గాలు స్వల్ప మార్పులతో చెయ్యకుండా యథాతథంగా అమలు చేస్తూ వచ్చారు. ఈ పూర్వరంగంలో నియమింపబడిన కొఠారి కమిషన్ రిపోర్టు సమగ్రమైనదిగా గుర్తింపబడ్డప్పటికీ దాని సిఫార్సులను అమలు చేయడానికి పాలకవర్గాలు ఇప్పటికీ చిత్తశుద్ధితో పూనుకోవడం లేదు. 1980 నుండి జరిగిన పరిణామాలతో రూపొందిన నూతన విద్యా విధానం భారతదేశాన్ని నిరక్షరాస్యతలోకి నెట్టివేస్తోందని సీతారాం ఏచూరి పేర్కొన్నారు.

"ఒక దేశ ఆర్థిక, సాంస్కృతికాభివృద్ధికి, జాతీయ సమగ్రతకు, పటిష్టమైన విద్యావిధానందుకు పునర్నిర్మాణం అవసరం ప్రజల జీవన విధానం కోసం విద్యావకాశాలకు పెంచేందుకు అన్ని స్థాయిల్లో విద్యా నాణ్యతను పెంచే తీవ్ర ప్రయ శాస్త్ర, సాంకేతికాభివృద్ధిపై శ్రద్ధ విలువలను పెంచి పోషించేందుకు అవసరమైన విధాన మార్పులను చేపట్టాలని, ప్రపంచ దేశాల్లో సమున్నత స్థానం పొందేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని కె.ఎన్.ఫణిక్కర్ 'భారతదేశ విద్యావిధానం–దిశ ఎటు' అనే అంశంపై తాను చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు.

ఇపుడు కాషాయనేత హడావిడిగా మార్పులు చేస్తున్న పాత ఎన్.సి.ఇ.ఆర్.టి. పాఠ్యపుస్తకాల్లో ప్రాచీన ఈజిప్టు, మెసపొటేమియా, గ్రీకు, రోమన్, మయాస్ తదితర నాగరికతల్లోని మతవిశ్వాసాల గురించి అర్థం చేసుకునే విధంగా వున్నాయి. అయితే వీటిని కనీసం రచయితలను కూడా సంప్రదించకుండా తొలగించడం, గందరగోళం, తప్పుల తడకగా వుండేలా, మతపరం చేసేలా వక్రీకరించి మరీ కొత్త పుస్తకాలను, రూపొందించిన ఘనత నేటి కాషాయ నేతలకే దక్కుతుంది.

ప్రతి దేశానికి వాస్తవమైన గత చరిత్ర, జ్ఞాపకాలుండాలి. కానీ గొప్పవాడు కల్పనలు, కథనాలు, సృష్టించడాన్ని అందరూ హెచ్చరికగా స్వీకరించాలి. దానికి తమ జాతి, కులం మతం లాంటి అన్ని రకాల వేర్పాటువాద సమస్యలను లేవనెత్తే దురుద్దేశం కూడా జత అయితే దుష్పరిణామాలు చాలా తీవ్రంగా వుంటాయని ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్‌హబీబ్ 'సంఘపరివార్ చరిత్ర పునః రచన' అనే అంశంపై రాసిన వ్యాసంలో అభిప్రాయ పడ్డారు. ఇంత అమూల్యమైన అభిప్రాయాలు కలగలసిన ఈ పుస్తకాన్ని మేధావులు, విజ్ఞులు ప్రతి ఒక్కరు పరించితీరవలసిన అవసరం వుంది.

- భాస్కర్

స్వీకారం



ప్రపంచ వాణిజ్య సంస్థ నాడు–నేడు–రేపు
రచన:గూడవల్లి నాగేశ్వరరావు; వెల:రు. 12/–; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

అడివి
రచన:డా॥ సి. హెచ్. రమేష్; వెల:రు. 30/–; ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్; విశాలాంధ్ర బుక్‌హౌస్ హైదరాబాద్; ప్రజాశక్తి బుక్‌హౌస్ హైదరాబాద్



మహనీయుల మంచిమాటలు
సంకలనం, సంపాదకుడు : పి.రాజేశ్వరరావు
వెల : రు. 13/– ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు


కంఠేశ్వర ఆలయం

ప్రాచీన ఆలయాలకు ప్రసిద్ధి నిజామాబాద్ జిల్లా

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుండి రెండున్నర గంటల్లో నిజామాబాద్ పట్టణం చేరుకోవచ్చు. ఈ జిల్లాలో ప్రాచీన ఆలయాలు, ప్రాచీన నాగరికతకు చిహ్నాలను దాచుకున్న మ్యూజియం, దట్టమైన అడవులు, అందమైన సరస్సులు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. బాసరలోని సరస్వతీ ఆలయం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నప్పటికీ నిజామాబాద్‌కు 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది.

కంఠేశ్వర ఆలయం

పట్టణంలోని కంఠేశ్వర ఆలయాన్ని శాతవాహన రాజు రెండవ శాతకర్ణి నిర్మించారు. శాతవాహనులు బౌద్ధాన్ని ఆచరించినా జైనుల కోసం దీన్ని నిర్మించారు. ఈ ఆలయం మొత్తం ఉత్తర భారత శిల్పకళారీతులతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఏడాదికోసారి రథసప్తమి రోజున ఈ ఆలయంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఖిల్లా రామాలయం

ఇందూరు లేదా ఇంద్రపురిగా పిలువబడే ఈ పట్టణాన్ని, ఇక్కడి కోటను రాష్ట్రకూటులు నిర్మించారు. 1311వ సంవత్సరంలో అల్లావుద్దీన్ ఖిల్జీ ఈ కోటను ఆక్రమించాడు. ఆ తర్వాత బహుమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీల అనంతరం అసఫ్ జాహీల చేతిలోకి వెళ్ళింది. 10వ శతాబ్దంలో రాష్ట్రకూటులు నిర్మించిన ఈ కోట ఆంగ్లేయుల వశమయ్యేవరకు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఛత్రపతి శివాజీ గురువు అయిన సమర్థ రామదాసు ఈ కోటలో రామ మందిరం నిర్మించారు.

మల్లారం అడవి

నిజామాబాద్ పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలోనే మల్లారం అడవి ఉంది. ఈ అడవి పర్యావరణాన్ని ఆరాధించేవారికి మంచి పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందింది. 150 కోట్ల సంవత్సరాల క్రితం నాటివిగా శాస్త్రవేత్తలు గుర్తించిన శిలలు పర్యాటకులకు విస్మయం కలిగిస్తాయి. పిక్‌నిక్‌లకు ఇది అనువైన స్థలం.


అలీసాగర్ బోట్ షికార్

అలీసాగర్

జిల్లాలోని అలీసాగర్, అశోక్‌సాగర్ పర్యాటకులను ఆకర్షిస్తాయి. నిజామాబాద్ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో బాసర రోడ్డులో 1930లో నిర్మించిన ఈ రిజర్వాయర్ చూడముచ్చటగా ఉంటుంది. అశోక్‌సాగర్ కూడా నిజమాబాద్‌కు 7 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రెండు రిజార్వాయర్ల చుట్టూ తోటలు, అడవులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

దోమకొండ కోట

కామారెడ్డి పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దోమకొండ కుతుబ్‌సాహీ, అసఫ్‌జాహీల కాలంలో సంస్థానంగా ప్రసిద్ధి కెక్కింది. తెలంగాణాలోని సంస్థానాధీశులు తమ కోటలను సంరక్షించుకోవడానికి ఎంత పకడ్బందీ చర్యలు తీసుకునేవారో ఈ కోట చూస్తే అర్థమవుతుంది. పురాతత్వ శాఖ ఆధ్వర్యంలోని మ్యూజియం నిజామాబాద్ పట్టణంలో చరిత్ర పూర్వయుగం, చరిత్ర యుగానికి సంబంధించిన ఎంతో సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుంది. జాతీయ రహదారిపై ఆర్మూర్ సమీపంలో సహజసిద్ధంగా ఏర్పడిన అత్యంత పురాతాన శిలల గుట్టలు అబ్బురపరుస్తాయి. ఆ గుట్టల పైన నవనాథ సిద్ధేశ్వర ఆలయం కూడా ఉంది. ●



✻ తుంబలి శివాజీ



రేపటి ప్రేక్షకుల కోసమే మేము నటిస్తున్నాం

నాటకం ఎప్పటికీ సజీవమైన దృశ్యరూపకం. తాత్వికులు జీవితాన్ని నాటకరంగంతో పోల్చడంలో అంతరార్థం కూడా ఇదే. అంతటి గొప్ప నాటకరంగంలో తమ లక్ష్యాల్ని సాకారం చేసుకుంటున్న నాటక సంస్థ భూమిక, ది థియేటర్ గ్రూప్ విత్ డిఫరెన్స్. పద్నాలుగేళ్లుగా కాకిబంగారం, చల్‌చల్ గుర్రం, మరీచిక, కిస్సాఏక్‌అజ్‌నబీ లాష్‌కా, ఏమో గుర్రం ఎగరావచ్చు, జోర్ లాగాకే హైస్సా, 58 నాటౌట్, గాంధీ దర్శన్, యమరాజ్ బోలే సే సాల్‌జియో, మహానగరం, పుత్రకామేష్టి, స్వాతంత్ర సమరభేరి, డామిట్ కథ అడ్డం తిరిగింది, చావనీ, ఓ సినీ భస్మాసుర, అరుణ, తెల్లసున్న, చరణదాసు, నాగమండల్, నందనవనం, ద్రౌపది వంటి నాటకాల ద్వారా తన వైవిధ్యాన్ని చాటుకుంది. 'మేం ఎప్పటికీ ప్రజలకోసం, ముఖ్యంగా భవిష్యత్ ప్రేక్షకులకోసం నాటకాలు వేస్తామంటున్న ఆ సంస్థ వ్యవస్థాపకులు, దర్శకులు ఉదయభానుతో ఇంటర్వ్యూ:

● *మీ గ్రూప్‌ని ఎప్పుడు- ఏ లక్ష్యంతో ప్రారంభించారు?*

మా గ్రూపుని 1989లో ప్రారంభించాం. తెలుగు నాటకం కేవలం పరిషత్తుల పోటీలమీదే బతుకుతోంది. మొదట పరిషత్తుల్లో ఆడేవాళ్లం. ఐతే ఆ పోటీల తాలూకూ ఎకనమిక్స్, ఫార్ములా, నిబంధనల పరిమితుల్లోనే నాటకం తయారు చేసుకొని ఆడాల్సివచ్చేది. ఎందుకు నాటకం వేస్తున్నామో ప్రతి ఐదునిమిషాలకీ పదేపదే చెప్తుంటామన్నమాట. దటీజ్ బ్యాడ్ గ్రామర్. కారణమేంటంటే దానికి వాళ్లిచ్చే డబ్బులు తక్కువ. కంటెంట్‌పరంగా, టెక్నికల్‌గా ఎటువంటి ఉన్నతీ లేకుండా పోయింది. దీనికి భిన్నంగా నాటకం వెయ్యాలనే ఉద్దేశంతో "భూమిక"ని ప్రారంభించాం. మాకుగా మేము కొన్ని పరిమితులు విధించుకోవడంతో ప్రదర్శనావకాశాలు తగ్గిపోయాయి. అయితే మేమంతా రైల్వే ఉద్యోగులం. పిల్లలు సరిపడినంతమంది వున్నారు. రైల్వేశాఖ హిందీ నాటకాలకి ప్రోత్సాహం ఇప్పిస్తుంది. మేం ప్రతీ ఏడాది ఓ హిందీ నాటకం వేసేవాళ్లం. ఔత్సాహిక నటీనటులుండడం అనేది మ్మా సంస్థకి ప్రత్యేకం. వేరే ఎక్కడా ఇలా వుండదు.

● *మీ గ్రూప్ వాస్తవిక నాటకాలకి కొంచెం దూరమనుకుంటాను...*

మేం వాస్తవికతావాద నాటకాలకి కొంచెం దూరంగా... అంటే డైలాగ్ ఓరియంటెడ్ నాటకాలకి కొంచెం దూరంగా వచ్చేశాం. గతంలో మేమూ కొన్ని ప్రదర్శించాం కూడా. మేం అలా అలా జానపదాలవైపుకి మళ్లాం. మేం చేసిన మొదటి జానపద నాటకం 'మహానగరం' అనే స్ట్రీట్ ప్లే. జానపద బాణీలు పెట్టడంతో ఆ నాటకానికి అందం వచ్చింది. ఆ నాటకం చూసిన ప్రముఖ సినీ దర్శకులు బాలచందర్ ఉబ్బితబ్బిబ్బైపోయి నాటకం అద్భుతంగా వుందంటూ మూడు పేజీల ఉత్తరం వ్రాశారు. అది ఆ జానపద బాణీల ప్రభావమేనని నేనిప్పటికీ చెప్పగలను. ఆ తర్వాత మేం పాటలేకుండా నాటకాన్ని ఊహించలేదు.

● *మీ నాటకాల్లో సంగీతానికిచ్చే ప్రాధాన్యత ఎంత?*

సినీ భస్మాసుర లాంటి నాటకాలు తప్పితే వేటినీ పాటలేకుండా వేయలేదు. ఆ పాటకూడా యాక్టర్సే పాడాలి. దానికుండే మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కూడా అతి తక్కువ. వీలైతే యాక్టరే వాయించేలా చేస్తున్నాం. నేను డైరెక్ట్ చేసే నాటకాల్తో ఇతర రాష్ట్రాలకు వెళ్లేటప్పుడు అక్కడనుంచి ఫోక్ కేసెట్లు తీసుకుని వినడం అలవాటు. ఆ బాణీలతో పాటకట్టేసేవాళ్లం. ఉదాహరణకి మా "చరణదాసు" నాటకంలో అన్ని భోజ్‌పురీ ట్యూన్సే. అవి ఉత్తర భారతంలో పాపులర్ ట్యూన్స్. ఈ నాటకం అయిపోయాక దాదాపుగా అందరూ మెయిన్ థీమ్ సాంగ్‌ని పాడుకుంటూ వెళ్తారు. అది ఆ ట్యూన్ గొప్పతనమే. అది ఆ నాటకంలో కలిసి పోవడం కూడ ఒక కారణం.

● *ఒక ప్రాంతీయ జానపదరూపకాన్ని సంపూర్ణంగా ఎప్పుడూ ప్రదర్శించలేదా?*

కేంద్ర ప్రభుత్వం వారు గిరిజనతెగల కళలకు పట్టణప్రాంతాల్లో ప్రాచుర్యం కల్పించటానికి ఓ పథకాన్ని ప్రకటించారు. మేం చిత్తూరుజిల్లా కంగుందికుప్పంకి చెందిన అద్భుతమైన వీధినాటకాన్ని తీసుకొని ప్రాజెక్టుకు దరఖాస్తు చేశాం. దానికి ఆమోదం లభించింది. కంగుందికుప్పం గురువుని తీసుకొచ్చి వాళ్ల దరువులు- పద్యాలు- సంగీతం నా పర్యవేక్షణలో గ్రూపుకి నేర్పడం జరిగింది. 'ద్రౌపదీ మాన సంరక్షణ' అనే ఆ నాటకాన్ని కథనం ఏమాత్రం మార్చకుండా కొంత మోడ్రనైజ్ చేశాం. స్త్రీ ప్రధాన దృక్పథంతో మేమా నాటకాన్ని తయారు చేసాం. ఆగస్టు 11న మొదటి ప్రదర్శన ఇచ్చాం. మొదటి ప్రదర్శనకుండే సమస్యలు అందులో వున్నాయి. ముఖ్యమైన సమస్య నిడివి ఎక్కువ కావడం. యాక్టర్స్‌ని పాలిష్ చేయడమనేది అసాధ్యమేమీ కాదు.

● *మీ పై ఎవరి ప్రభావముంది?*

కొన్ని సంవత్సరాలు నాటకాలు వెయ్యడం కంటే చూడడమే ఎక్కువ తటస్థించింది. ఢిల్లీలో ఎక్కడైనా ఫెస్టివల్ జరుగుతోందంటే రైల్వేవాణ్ణి కనుక పాస్ తీసుకొని వెళ్లిపోయేవాణ్ణి. వారం రోజులు ఫెస్టివల్ చూసివచ్చేవాణ్ణి. అలా మిగతా చోట్ల జరిగిన అన్ని నాటకాల ప్రభావం నాపై వుంది.

● *'సంపూర్ణ భారతీయ నాటకం' విషయంలో మీ అభిప్రాయం?*

ఇప్పటి దాకా ఎంత సేపూ వెస్ట్రన్, యూరోపియన్ థియేటర్ల మోడల్ మనది. మనం ఇంగ్లీషు చదువులు చదువుకొచ్చాక బ్రిటిష్‌వాళ్ల నాటకాలతో ప్రభావితులమై వాళ్ల నాటకాల్నే వేయడం జరిగింది. పాశ్చాత్యులు ఏం చేస్తే దాన్ని కాపీ చేస్తూ మోడ్రన్ థియేటర్ అంటూ చెప్పుకున్నాం. పది పదిహేనేళ్ల క్రితం ఇండియన్ థియేటర్‌లో సంగీత నాటక అకాడమీ వాళ్లు 'అసిస్టెన్స్

టు యంగ్ థియేటర్ వర్కర్స్' పేరిట ఒక స్కీమ్ ప్రారంభించారు. స్థానికంగా మీకు తెల్సిన ఒక జానపద రూపాన్ని అధారంగా చేసుకొని దాన్ని మోడ్రన్ థియేటర్‌కి ఎట్లా అన్వయించుకుంటారో చేయమని ఒక సూత్రం రాసిచ్చి పెట్టారు. మొదట చాన్నా తప్పనిసరి చేశారు. తర్వాత్తర్వాత సడలించారు. అప్పుడు ప్రతివాడూ వాడి స్టేట్‌లో వుండే జానపదరూపం వైపు దృష్టి మళ్లించాడు. అలా కొన్ని ప్రయోగాలు జరిగాయి. దీన్ని మేం కొనసాగించాం.

● "చరణదాసు" నాటకానికి నంది పురస్కారం పొందారు కదా...

1990లో నంది నాటకోత్సవాలప్పుడు మెయిన్ పోటీల్లో చరణదాసుకి సెకండ్ బెస్ట్ ప్రొడక్షన్, బెస్ట్ మ్యూజిక్, బెస్ట్ డైరెక్టర్ అవార్డులు వచ్చాయి. బెస్ట్ మ్యూజిక్ రావడంలో విశేషం లేదు. ఎందుకంటే మిగతా నాటకాలకి సంగీతం వుండదు. మిగతా విషయాల్లో అభినందనలందుకున్నాం. చూడగా చూడగా కొన్ని గ్రూపుల్లో మా నాటకం ప్రభావం కనిపించింది. మమ్మల్ని చూసి వాళ్లు పాటలు పెట్టడం మొదలెట్టారు. నంది వల్ల మాకు జరిగిన ఇంకో లాభం ఏంటంటే అప్పటిదాకా మా గ్రూప్ కార్యకలాపాలు జంటనగరాలకే పరిమితం. నందిలో పేరొచ్చిన దగ్గర్నించి ఆంధ్రదేశంలో చాలామంది ప్రదర్శనలకు పిలిచారు. పదిహేన్నుంచి ఇరవై దాకా ప్రదర్శనలిచ్చాం. వెళ్లిన చోటల్లా నాటకం సూపర్‌డూపర్ హిట్. పిల్లల్తో మా ఇంటరాక్షన్ రిహార్సల్స్‌నుంచే మొదలయ్యేది. నాటకం ముగించుకొని రైలెక్కేసేదాకా పిల్లలు మాతోటే వుండేవారు. ముఖ్యంగా మా నాటకం యువతను బాగా ఆకట్టుకుంది. ఒకసారి బాపట్ల వెళ్లాం. అక్కడ మేం రిహార్సల్స్ వేసే ఎదురుగుండా కాలేజీ హాస్టల్ అనుకుంటా వుంది. మా పాటలు విని ఇద్దరు ముగ్గురొచ్చి చూశారు. వాళ్లు నాటకం చాలా బాగుంటుందంటూ సాయంత్రం మా ప్రొగ్రాంకి అరవైమంది కుర్రాళ్లని తీసుకొచ్చారు.

ఔత్సాహికులకు ప్రోత్సాహం...

ఈ సంవత్సరం భారతప్రభుత్వ సాంస్కృతిక పర్యాటక మంత్రిత్వశాఖ 'భూమిక' బృందానికి గ్రాంట్ ఇచ్చింది. దీంతో జీతం లేదా స్టయిఫండ్ ఇచ్చి నటీనటుల్ని పెట్టుకుని నాటకాలు వేసేందుకు వీలవుతుంది. ఈ గ్రాంట్‌ని తన సభ్యులకే కాక బయటవాళ్లక్కూడా విస్తరింపచేయాలనుకుంటోంది ఈ నాటక సంస్థ. ఉత్సాహవంతులైన యువతీయువకులు వచ్చి నాటకాలు వేయదలచుకుంటే ప్రతిభ, అనుభవం, ముఖ్యంగా ఆసక్తిని బట్టి వాళ్లని తీసుకొని స్టైఫండ్ ఇచ్చి నాటకాలు వేయించాలనుకుంటోంది. ఔత్సాహికులకు కొంత ట్రైనింగ్ పీరియడ్ వుంటుంది. ముందు వాళ్ల బాడీ లాంగ్వేజ్, వాయిస్ కల్చర్ వృద్ధి చేయడానికి వర్క్‌షాప్‌లు, సెషన్స్ వుంటాయి. ఆసక్తి వున్నవారు ఈ క్రింది చిరునామాలో సంప్రదించవచ్చు.

భూమిక, థియేటర్ గ్రూప్ విత్ డిఫరెన్స్, 424/1, రైఫిల్‌రేంజ్, హిమ్మత్‌నగర్, సికింద్రాబాద్ - 500025, ఫోన్ నెం. 040-27834103.

● నాటకం ఎటువంటి ప్రేక్షకుల్ని కోరుకుంటుంది?

మేం నాటకంవేస్తే పిల్లలు, యువజనులు తప్పనిసరిగా మా నాటకాన్ని మెచ్చుకోవాలి. మేం నాటకాలవాళ్లకోసం నాటకం వెయ్యం. ప్రేక్షకులకోసం వేస్తాం. కొత్త ప్రేక్షకుల్ని ఏర్పరచుకోవడం కోసం వేస్తాం. భవిష్యత్ ప్రేక్షకులకోసం వేస్తాం. ఈ ప్రేక్షకుల్నించే కదా నటీనటులు రావాల్సింది!

● ఇప్పటి నాటకాలు ఎదుర్కొనే ప్రధానసమస్యల్ని మీరెలా అధిగమిస్తారు ?

ప్రభుత్వం వారు రవీంద్రభారతిలో ప్రతి శుక్రవారం నాటకాలు వేయిస్తుంటారు. ప్రస్తుతం సిటీ దూరదూరంగా పెరిగిపోతుండడంతో ప్రతిఒక్కరూ అక్కడకొచ్చి నాటకాలు చూడలేరు. ఇంతకు ముందు టికెట్టు కొని నాటకం చూడాలనే స్లోగన్ కూడా వచ్చింది. టికెట్టు కొనుక్కోవడం భారమైన పనేంకాదుకానీ, దూరాభారం- సమయాభావం- ముఖ్యంగా టీవీలూ, సినిమాల్లాగా ప్రచారం ఏమీలేకపోవడంతో, సమాచారం అందకపోవడంతో నాటకానికి జనం తగ్గిపోతున్నారు. మేం చేసిన సర్వే ప్రకారం ఈ నాటకాలు చూడ్డానికి వచ్చేది సిటీ శివార్లలో వుండేవాళ్లే. వీటిని అధిగమించడానికి మేం చేయదల్చుకున్నదేంటంటే మా గ్రూప్‌తో రెండుమూడు నాటకాలు చేతిలో పెట్టుకుని ప్రతీ కమ్యూనిటీ సెంటర్‌కి వెళ్లి ఆడతాం. లేదంటే ఒక స్కూల్లో, మైదానమో ఎక్కడైతే అక్కడకు వెళ్లి నాటకాలు వేయాలనే సంకల్పంతో వున్నాం. ఇది ఖర్చుతో కూడుకున్నపని. దీనికి ఎవరైనా స్పాన్సర్స్, గవర్నమెంట్‌వాళ్లో ముందుకొస్తే మంచిది. అంతకన్నాముందు 'మేం చేయగలం' అని చెప్పడానికి పది కమ్యూనిటీ సెంటర్స్‌ను గుర్తించి వీలైతే జనవరి నుంచి ప్రదర్శనలు మొదలెడదామనే ఆలోచనతో వున్నాం. వాటికొచ్చిన ప్రతిస్పందన బట్టి ఎవరన్నా స్పాన్సర్స్‌నో, ప్రభుత్వాన్నో కలవాలనేది మా ఆలోచన. ఈ పది ప్రదర్శనలకి స్పాన్సర్స్ దొరికినా-దొరకకపోయినా మేం చెయ్యాలని నిర్ణయించుకున్నాం.

● టీవీ, సినిమాల ప్రభావం నాటకాన్ని దెబ్బ తీస్తోంది కదా...

టీవీల్లోనూ, సినిమాల్లోనూ వేసే నటులు వీలు చూసుకుని నాటకం వేయడం జరిగితే అటు సినిమాలకూ- ఇటు నాటకాలకూ మేలు జరిగే అవకాశముంది. ఈ మధ్య కలకత్తా వెళ్లినప్పుడు మాఫ్రెండ్ నడిగాను. అతనో గ్రూప్ రన్ చేస్తున్నాడు. అక్కడో గొప్ప విషయం ఏంటంటే టీవీలోగానీ, సినిమాలోగానీ వేషం వెయ్యడానికెళ్తే... "మీకేదయినా నాటకంలో అనుభవం వుందా'' అని అడుగుతున్నారట. లేదంటే పొమ్మంటున్నారట. దీనివల్ల సినిమాల్లో ఉత్తరోత్తరా వేద్దామనుకునేవాడు ముందు ఏ నాటకం గ్రూపులోనో ఆశ్రయం చూసుకుంటాడు. కొంత నేర్చుకుంటాడు. తరువాత సినిమాల్లోకి వెళ్తాడు. దానివల్ల నాటకానికి కొంత ఇన్‌పుట్స్ వస్తున్నాయి. నాటకం నుంచి కొందరు వెళ్లిపోతుంటారు, మరికొందరు వస్తుంటారు. ఇక్కడ మనకది జరగలేదు. సడన్‌గా ఇన్ని ఛానెల్స్ వచ్చేసి మా గ్రూప్‌లోని నటులందర్నీ తీసుకెళ్లిపోయాయి. ఇంతకుముందు సిటీలో పదిపన్నెండు గ్రూపులుండేవి. ఇప్పుడు రెండో మూడోవున్నాయి. పోవడమే జరుగుతోందికానీ రావడం జరగట్లేదు. ఇప్పటికైనా సినిమావాళ్లు సాయంత్రం ఎప్పుడన్నా వీలుచూసుకుని నాటకాల్లో గనక వేసినట్లైతే దీని డైనమిక్స్ మారిపోతాయి. నాటకం వేసేవాడికే డైలాగు చెప్పగలిగే సత్తా వుంటుంది.

● నేటి సమాజానికి నాటకం ఎంతవరకు అవసరం? దానికి మీ గ్రూప్ చేస్తున్న కృషి ఏంటి?

నాటకం అనేది కమ్యూనిటీ సమస్యల్ని ప్రతిఫలిస్తూ వాళ్ల ఆనందాల్లో పాలుపంచుకునేలా వుండాలి. ఒక డాక్టర్ ఇండియా మొత్తానికి ఎలా కన్సల్టెంట్ కాలేడో అలాగే ఒక నాటకం కూడా. మేం మనసా వాచా నమ్మింది, సొసైటీకి అవసరమనుకున్నది, సొసైటీని ప్రశ్నించాలనుకున్నది నాటకంగా వేస్తాం. ●

మనకోసం మనం

పోనీ అనుకోబట్టే
ఎన్నో అవకాశాలు
చేజార్చుకొన్నాం
పోనీ అనుకొంటే
మన పొట్టకొట్టి
ఒకడు మేడలు
మిద్దెలు కట్టాడు
పోనీ అనుకోబట్టే
ఎవడోవచ్చి
మనసంతలో
వస్తువులు
అమ్ముకొంటున్నాడు
మన ఉత్పత్తికి గిరాకీ
లేక
నిస్సహాయంగా చూస్తూండి పోతున్నాం
పోనీ అనుకొంటూపోతే
చివరకు మనం పోయే పరిస్థితి
దాపురించింది
జవసత్వాలు నిర్వీర్యమైపోయి
పనిలేక తిండిలేక
అన్నమో రామచంద్రాఅంటూ
అఘోరిస్తున్నాం
తెనెపూసిన చిలకపలుకులు
ఇంతకాలం వింటూ వచ్చాం
మళ్ళీ అవే పలుకుల్ని
పలకటానికి ఎన్నో గొంతులు
అప్పుడే కసరత్తు ప్రారంభించాయి.
ఇంకిపోయిన కన్నీళ్ళతో
అలసిపోయిన కళ్ళు
స్వప్నాలను కనటం మానేశాయి
అస్సలు నిద్రుంటేగా
నిద్రపోయి ఎన్నాళ్ళయిందో
పరిష్కారంవైపు
మనకాళ్ళు కళ్ళు ఆలోచనలు
కదలాలి... మనకోసం మనం
బ్రతికేస్వేచ్ఛ మనమే
వెదుక్కోవాలి నిర్ణయించుకోవాలి

- మంకు శ్రీను

ADVOCATE

న్యాయసలహాలు

పుట్టింటికి వెళ్ళాలంటే భయం వేస్తోంది!

నేను 1995లో ప్రేమ వివాహం చేసుకున్నాను. మా ఇద్దరిది ఇంటర్ కాస్ట్. మేము దాదాపు 9 సం॥ల నుండి ఆర్థిక ఇబ్బందులతో కాలం గడుపుతున్నాము. నాకు ఇద్దరు చెల్లెల్లు, ఒక అక్కయ్య ఉన్నారు. వాళ్ళందరి పెళ్ళిళ్ళు అయిపోయినవి.

అమ్మ వాళ్ళ నుండి నాకు ఎలాంటి హెల్ప్ లేదు. నా పిల్లలు అమ్మమ్మ, తాతయ్య అని అంటూ, వాళ్ళింటికి వెళ్దామంటూ గొడవ చేస్తున్నారు. నాకు అమ్మ దగ్గరకు వెళ్ళాలంటే ధైర్యం చాలట్లేదు. నాకు ఒక్కపైసా ఆస్థి ఇవ్వలేదు. పైగా నేను చనిపోయానంటూ, వాళ్ళ ముగ్గరికే ఇచ్చాడంట మా నాన్న ఆస్థి. మా నాన్న రిటైర్డ్ టీచర్. నాకు మా నాన్న నుండి ఆస్థి వచ్చే అవకాశాలున్నాయా, ఎలానో తెలుపగలరు.

- ఎ.రజని, వరంగల్.

జీవితంలో స్థిరపడకుండానే, తల్లిదండ్రులనెదిరించి ప్రేమ వివాహాలు చేసుకుంటే వారి ఆదరణ, ప్రేమ, కరువుతో, సమాజంలో చాలా ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మీరు ఆ కష్టాలనే అనుభవిస్తున్నారు. పెళ్ళి అయ్యి దాదాపు 8 సంవత్సరాలు దాటింది. కావున మీ వాళ్ళకు కూడా మొదట్లో వున్నంత కోపాలుగాని, పట్టింపులు గాని ఉండకపోవచ్చు. సమాజాన్ని చూసి భయపడి, వాళ్ళ పెద్దరికాన్ని లెక్క చేయక తన ఇష్టం వచ్చినట్లు వెళ్ళి పెళ్లి చేసుకుంది కాబట్టి ఆ బాధలు తనే అనుభవించనీ తెలిసి వస్తుంది అనుకుని వుంటారు. మీరు భయంతో పెద్దవాళ్ళ దగ్గరికి వెళ్ళడం లేదని అన్నారు. కాని మీరు బెట్టుగా, మొండిగా మా దగ్గరికి రావట్లేదు అని వాళ్ళనుకుంటుంటారు. మీరు ధైర్యంగా మీ వాళ్ళ దగ్గరికి ఒకసారి వెళ్ళండి. తల్లిదండ్రుల మనసు ఎలా ఉంటుందో మీకే తెలుస్తుంది. మీ పిల్లల్ని కూడా వారి వద్దకు పంపించండి. మనవండ్లని చూసుకుని ఏ తాత ముచ్చట పడకపోవడం జరగదు. మీకు ఒకేసారి ఎదురుపడే ధైర్యం లేకుంటే, మీ సహోదరిణుల ద్వారా వారికి దగ్గరకండి. మాస్టారు కాబట్టి బెత్తం పట్టిన అలవాటు. ఒకటి రెండు సార్లు పెద్దతనంతో బెట్టు చేసినా మీరే దిగివచ్చారనుకుని తను ఆదరిస్తాడు.

ఆస్తి విషయానికి వస్తే మీ నాన్నగారి స్వార్జితమైతే మీకు ఇవ్వాలని ఏమీ లేదు. పిత్రార్జితమైతే మాత్రం మీకు చట్టపరంగా హక్కు ఉంటుంది. కాని మీరు ముందుగా ధైర్యంగా వారి వద్దకెళ్ళి మీ బాధలు తెలియపరచుకోండి. తప్పక ఫలితం వుండవచ్చు.

ఉద్యోగం లేకున్నా భరణం పొందొచ్చు

నాకు పెండ్లి అయి సుమారు 7 సంవత్సరాలు అయినది. కాని నా భర్తకు నా పైన ఎన్నడూ ఇష్టం లేదని తన తల్లితో చెప్పాడు. కోరిన కట్నం, సామాగ్రి ఇచ్చి అతనికి సేవలు చేసినా తాగుడు వ్యభిచారం మానకుండా ఉద్యోగం విడిచి తిరుగుచున్నాడు. మూడు ఏండ్ల నుండి నన్ను హింసిస్తున్నాడు. ఇదంతా తెలిసి కూడా దగ్గరలో వున్న అతని తల్లిదండ్రులు రావడమే లేదు. ఈ హింస భరించలేక నేను ఒక నెల క్రితం బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో రిజిస్ట్రేసన్ చేయించి, కోర్టులో కూడా దరఖాస్తు పెట్టుకొన్నాను. 2003 మే నెల నుండి ఎన్ని వాయిదాలకూ అతడు రావడం లేదు. మారుపేరు పెట్టుకొని కోర్టువారు పంపిన నోటీసులను గుంటూరు నుండి పంపివేయగా ఆఖరికి మా అత్తకు, బావకు, మరుదులకు కోర్టు నోటీసులు పంపి అరెస్టు చేయించగా 30 వేలు ఇచ్చుకుంటామని, వారు స్టేషన్‌లో ఎస్.ఐ.గారికి లిఖిత పూర్వకంగా రాసి సంతకాలు చేసి ఇచ్చారు. కాని ఈ పైసలు పోలీసు వారు, నాకు, కోర్టుకు పంపుట లేదు. నవంబరు-జనవరి-ఫిబ్రవరి నెలలలో ఈ పైకం ఇస్తామని రాసి ఇచ్చిరి. కాని కోర్టువారు ఇంకా చూడలేదు. ఈ రిపోర్టు నాకు ఉపకరిస్తుందో లేదో తెలపండి.

- కొమ్మూరి రేవతి, బొబ్బిలిపోస్ట్, విజయనగరం జిల్లా.

మీ భర్త ఎంత వ్యసన పరుడో తెలియచేశారు. అలాంటి వాడిని మీ అత్తమామలే పట్టించుకోవడం లేదు. మీరు బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టి ఉంటే పోలీసులు వెళ్ళి అరెస్టు చేస్తారు. అది వారి విధి. అలా జరగకుంటే పోలీసు వారిని కోర్టు మందలిస్తుంది. మీ భర్త ఎక్కువ రోజులు చట్టం నుండి తప్పించుకోలేడు. మీ భర్తగారి తల్లిదండ్రులను అరెస్టు చేయించామంటున్నారు. వారు పోలీసుల నుండి తప్పుకోవడానికి అలా డబ్బులిస్తామని రాసిచ్చి వుంటారు. ఇరు పక్షాలు అంగీకరించారు కాబట్టి పోలీసులు అలా రాయించి ఉంటారు. దానిని మీ అత్తగారు లెక్కచేయకుంటే పోలీసు వారు ఏమీ చేయలేరు. అదే కాగితం కోర్టు వారి ముందు రాసి వుంటే తప్పుకోలేకపోయేవారు. మీరు వేసిన కేసు ఏమిటో వివరంగా చెప్పలేదు. మిమ్మల్ని బాధపెట్టారని వేస్తే అతనికి, అతని కుటుంబ సభ్యులకు ఐ.పి.సి. 498ఎ సెక్షన్ కింద శిక్ష పడుతుంది. కాని మీకు డబ్బులు రావు. మీరు భరణం కోసం అదే కోర్టులో ఇంకో కేసు వేయండి. మీకు, మీ ఇద్దరు పిల్లలకు కూడా భరణం పొందవచ్చు. మీ వారు కోర్టు నోటీసులు తీసుకోకుండా ఉంటే మీరు ఆ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులను కలవండి. కచ్చితంగా అతను దారికొస్తాడు. అతని ఉద్యోగం వున్నా, లేకున్నా మీరు భరణం పొందగలుగుతారు.

- గుండ్లపల్లి లక్ష్మీనరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

శనగపిండి మిఠాయి

కావలసిన వస్తువులు

శనగ పిండి	:	2 కప్పులు
నెయ్యి	:	1 కప్పు
పంచదార	:	2 కప్పులు
ఏలకులు	:	నాలుగు

చేసే విధానము: అడుగు మందం ఉన్న గిన్నెలో సగంనెయ్యి వేసి కరిగిన తరువాత మంటను తగ్గించాలి. అందులో శనగపిండి కొంచెం కొంచెం పోస్తూ ఉండలు కట్టకుండా తిప్పాలి. దానిని నెమ్మదిగా కదిలిస్తూ 10 - 15 నిముషాలు ఉంచాలి. మధ్య మధ్యలో మిగిలిన నెయ్యిని పోస్తూ ఉండాలి. తరువాత పంచదార పోసి అది కరిగే వరకూ కదిలించాలి. పాకం కొంచెం దగ్గరకు వచ్చిన తరువాత ఓ పళ్ళెంలో కొంచెం నెయ్యికానీ, నూనెకానీ రాసి అందులో పోసి సమంగా సర్దాలి. దానిని కనీసం రెండు గంటలు ఫ్రిజ్‌లో ఉంచి బయటకు తీసి ముక్కలుగా కోసుకోవాలి. లేదా దానిని బాగా ఆరనిస్తే తరువాత ముక్కలుగా కోసుకోవచ్చు.

బంగాళాదుంప బాల్స్

కావలసిన వస్తువులు

బంగాళా దుంపలు	:	నాలుగు పెద్దవి
పచ్చి బఠాణీలు	:	ఒక కప్పు
పచ్చి మిరపకాయలు	:	రెండు
అల్లం ముక్క	:	చిన్నది
కొత్తిమీర	:	చిన్న కట్ట
మైదా	:	ఒక కప్పు
కారం	:	అర స్పూను
ఉప్పు	:	తగినంత

చేసే విధానం: మైదా పిండి, కారం, ఉప్పును బజ్జీల పిండిలా కలుపుకోవాలి. బంగాళా దుంపలను ఉడికించి తొక్క తీసి మెత్తగా చేయాలి. పచ్చిమిరప కాయలు, అల్లం ముక్కను ముద్దగా నూరాలి. ఈ ముద్దను, సన్నగా తరిగిన కొత్తిమీరను బంగాళా దుంప ముద్దలో కలపాలి. దానిని చిన్న చిన్న ఉండలుగా చేయాలి. నూనె కాగిన తరువాత ఈ ఉండలను మైదా పిండిలో ముంచి ఎర్రగా వచ్చే వరకూ కాల్చాలి. వీటిని ఏదైన చట్నీతో తింటే బాగుంటాయి.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన
రైతువాణి
మాసపత్రిక

సంవత్సర చందా
రూ. 100/-
చందాదారులు కండి.
2004 మన రైతువాణి డైరీ,
క్యాలెండర్ ఉచితంగా
పొందండి.

వ్యవసాయరంగ
సంక్షోభానికి, రైతు నష్టాలకు
కారణాలను విశ్లేషించి
పరిష్కారాన్ని చూపేది
మన
రైతువాణి

సంవత్సర చందాదారులకు మాత్రమే ఈ అవకాశం.

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతు సంఘం కార్యాలయాలలోగాని చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136 లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక